



జ్ఞాన యోగం


విచారణ

ఆదిశంకరుల అపరోక్షానుభూతి








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఆదిశంకరుల

అపరోక్షానుభూతి

"బ్రహ్మవిద్యా విధానము"

భావానువాదం

భాగవతి రామమోహనరావు

ప్రకాశకులు

జ్ఞాన వికాస్ పబ్లికేషన్స్

210-8 ఆర్ టి. విజయనగర్ కాలనీ, హైదరాబాదు

1994

ప్రకాశకుల ఆకాంక్ష

ఉత్తమ ఆధ్యాత్మిక సాధకుల ఉపయోగార్థం, ఉత్కృష్టమైన ఈ గ్రంథం ప్రచురింపబడింది

ఈ గ్రంథంలో మొదట సాధకుల ప్రథమ యోగ్యతలు వివరించి, ఆత్మజ్ఞానప్రాప్తి కోసం లక్ష్యసిద్ధియైన పరమాత్మ స్వరూపచింతన యే విధంగా కొనసాగించవలెనో, శరీర, ప్రపంచాదుల యొక్క మిథ్యత్వాన్ని ఎలా గ్రహించి, నిర్ధారణ చేసుకొనవలెనో, దేహాత్మభావాన్ని, ప్రపంచ భ్రాంతినీ పోగొట్టుకొనేవిధానమేదో క్రమంగా వివరింపబడినాయి ఆత్మజ్ఞానం పూర్తిగా సిద్ధించడానికి పదిహేను అంశాలతో కూడిన తత్వవిచార సాధనాక్రమం, 101వ శ్లోకం మొదలుకొని బోధించబడింది జ్ఞానంతో కూడిన ఈ అంశాలను అవగాహన చేసుకుని, ప్రతినిత్యము అనుష్ఠానం చేసుకుంటే తప్పక ఆత్మానుభూతికి తోడ్పడగలదని ప్రకాశకుల ఆకాంక్ష.

జ్ఞానంతో చేసే అనుష్ఠానమే ఉత్తమమైన ఆధ్యాత్మికసాధన అవుతుందని, జ్ఞానంలేని అనుష్ఠానం అధమమని, జ్ఞానం పొంది అనుష్ఠానం లేకపోవడం మధ్యమమని వేదాంతశాస్త్రాల్లో సూచింప

బడింది. ఇక్కడ జ్ఞానమంటే వేదాంత శాస్త్ర జ్ఞానమని అర్థం. ముందు శాస్త్రజ్ఞానం వల్ల వివేకంతో తత్వనిర్ధారణ చేసుకుని, యదార్థమైన భగవత్తత్వాన్ని గ్రహించుకున్న అనంతరం, శాస్త్రోక్తంగా, స్వక్రమంగా ఆధ్యాత్మిక అనుష్ఠానానికి ఉపక్రమించడం ఉత్తమ సాధనగా సూచింపబడింది. వేదాంతశాస్త్ర పఠనం, మననం చేసి, సాధనావిధానాన్ని గ్రహించికూడా, సాధనకి ఉపక్రమించకపోవడం మధ్యమ అనుష్ఠానమని, వేదాంత శాస్త్రజ్ఞానం ఏ మాత్రమూ లేక, ఆత్మతత్వం ఎంతమాత్రమూ తెలుసుకొనక, అవివేకంతో, మూఢ నమ్మకములతో వివిధ బాహ్యక్రియా కలాపములు చేయటం అథమ అనుష్ఠానమని వ్యక్తం చెయ్యబడింది.

విద్యాబుద్ధులు కలిగిన సంస్కారవరులంతా ఉత్తమ అనుష్ఠానాన్ని ఆచరిస్తే ఆధ్యాత్మిక వికాసాన్ని తప్పక పొందగలరని శాస్త్రాలు స్పష్టం చేస్తున్నాయి.

స్వక్రమ సాధనానుష్ఠానం ద్వారా మోక్షపథాన్ని సాధించడానికి ఆత్మ జిజ్ఞాసులకు, ముముక్షువులైన ఆధ్యాత్మిక సాధకులకు ఈ గ్రంథం తోడ్పడగలదని ప్రకాశకుల ఆకాంక్ష.

హైదరాబాదు

ఇట్లు
ప్రకాశకులు

ఉపోద్ఘాతము

ఉత్తమ ఆధ్యాత్మిక సాధకులకు అంతిమలక్ష్యం ఆత్మానుభూతి. ఆత్మ బయట నుండి మనకు సంప్రాప్తించునది కాదు. అది అంతర్గతముగా మనము పొందు జ్ఞానవికాసమే. మనో, బుద్ధీంద్రియాల వేటి వల్లా,ఆత్మ తెలుసుకోబడేదికాదు. అది వాటికి అతీతం, అపరోక్షం అవడంచేత, ఆత్మానుభూతిని 'అపరోక్షానుభూతి'గా పేర్కొని, ఈ పవిత్ర గ్రంథాన్ని శంకర భగవత్పాదులు, ఆత్మజిజ్ఞాసులైన సాధకుల కోసం ప్రసాదించారు.

ఆత్మ నిరాకార, నిరతిశయానంద చైతన్య స్వరూపము. దానినే దేముడని, భగవంతుడని పలు విధ నామములతో పేర్కొంటున్నారు. సమస్త ప్రపంచమూ ఆత్మ చైతన్య స్వరూపమే. వేదాంత శాస్త్రాలలో దానిని బ్రహ్మం అని పేర్కొంటూ వివరించారు. బ్రహ్మం ఉన్నది అని తెలుసుకోడం పరోక్ష జ్ఞానం. ఆ బ్రహ్మాన్ని నేనే అయివున్నాను

(అహం బ్రహ్మాస్మి) అని అనుభవంతో అవగాహన కలగడం అపరోక్షజ్ఞానం, లేక స్వరూప జ్ఞానం, ఈ స్వరూప జ్ఞానం సంప్రాప్తించడానికి సంపూర్ణమైన సాధనా క్రమాన్ని ఈ గ్రంథంలో శంకరులు ప్రసాదించారు. అందుచేత ఈ గ్రంథానికి బ్రహ్మ విద్యా విధానమని కూడా పేరు పెట్టబడింది.

తన శరీరము తా నెంతమాత్రము కాదని, సాధకుడు వివేక, వైరాగ్యాలతో నిర్ధారణ చేసుకొనుచూ తానెవరో, తన నిజస్వరూపం ఏదో అన్వేషించుకొనుటకు తోడ్పడేసాధనానుష్ఠానమే బ్రహ్మ విద్యావిధానము. ఆత్మజ్ఞాన ప్రతిపాదకమగు విద్యకనుక, ఈ బ్రహ్మవిద్య విద్యలలోకెల్లా అతి ప్రధానమైనది.

అపరోక్షానుభూతి అనే ఆత్మానుభవం ఏ సాధన వల్ల, సులువుగా, సత్వరంగా సిద్ధిస్తుందో, ఈ గ్రంథంలో వివరించిన అంశాలవల్ల అవగాహన అవుతుంది. లక్ష్య సిద్ధికోసం ప్రయోజనకరమైన సాధన చేపట్టవలసి ఉంటుంది కదా ! తానీ నామరూపాలతో నున్న దేహాన్ని అనుకునే దేహభ్రాంతీ, తాను, ఇత

రులు. అనుకునే భేదబుద్ధీ ఉన్నంతవరకూ, సాధకుడు ఏమీ ఉన్నత స్థితి సాధించనట్లే. తానీ శరీరమనుకునే దేహభ్రాంతి క్రమక్రమంగా క్షీణిస్తోంటేనే కాని, సాధనలో తానేమీ ప్రగతి సాధించడంలేదని సాధకుడు తెలుసుకోవాలి. తాను, ఇతరులు, ఇతరాలు అనే బేధభావం, తానీ దేహాన్నను కునే దేహాత్మ భావంతో ముడిపడివుంటుంది.

ఉన్నది పరమాత్మ స్వరూపమొక్కటే. ఆంతర్యంలో సంకల్పాలుచేసే మనస్సనబడేది, బాహ్యంగా అనేక దృశ్యాకారాలతో ప్రపంచంగా భాసించేది, కొంతసేపు స్వప్నానుభవంతో గడిపేది, నిశ్చలంగా నిద్రలో నిమగ్నమైవుండేది ఆపరమాత్మ స్వరూపమే. అదొక్కటే తప్ప, ఇతరమంతా యదార్థంగా లేనటువంటి భ్రాంతి స్వరూపమే. ఈ పరమార్థ సత్యాన్ని అవగాహన చేసుకుని, ఆత్మానుభూతి (అపరోక్షానుభూతి) పొందడమే సాధన లక్ష్యం.

సాధనలో కదలికయే సాధకుని శత్రువు. నిలకడయే మిత్రుడు. కదలిక అంటే చలనం. అది

పాంచభౌతిక శారీరక చలనంకాదు. అజ్ఞానంతో ముడి పడివున్న సూక్ష్మ శరీర సంబంధితమైనది. దానివల్లనే దేహ ప్రపంచాదుల స్మృతి, ఆత్మ యొక్క విస్మృతి తటస్థపడటం. హృదయంలో చలనం కలిగినంతనే, అహంకారంగా, మనస్సుగా, దేహ దృశ్య ప్రపంచా కారాలుగా నిశ్చలమైన ఆత్మస్వరూపుడు భాసిస్తు న్నాడు. ఈ చలనం చలనంవల్ల కలిగే ఈ వికారాలు, దృశ్యాలు అన్నీ వాస్తవంగా కల్లలే. యదార్థాలు కావు. చలనంవల్ల అహంకార భ్రాంతి, అహంకార భ్రాంతివలన దేహాత్మబుద్ధి, అంటే, తానొక శరీరుణ్ణను కునే భ్రాంతి; తరువాత జీవత్వంతో కూడిన సర్వ సాంసారిక దృశ్య విషయ అనర్థముల భ్రాంతి. జ్ఞాన యుక్తమైన సాధన ద్వారా నిశ్చలతను అలవరుచు కొనడంతో,ఇవన్నీ విలయమై తనలోనే లీనమౌతాయి. దేవాలయంలోని విగ్రహం ఎలా ఉంటుందో అలాంటి దృఢమైన నిశ్చలత్వం అలవరచుకోవాలి. నిరంతర ధ్యానాభ్యాసం వల్లా, వైరాగ్యం వలనా, అది సంభ విస్తుంది. హృదయంలో ఎప్పుడు అలాంటి నిలకడ ఏర్పడుతుందో—అప్పుడు, దేహాత్మ బుద్ధీ, సర్వ దృశ్య

భ్రాంతులూ విలయమై, అవేవీ నిజంగా లేని మిథ్యా స్వరూపాలు, మాయా స్వరూపాలు తప్ప, యదార్థాలు కావని తేటతెల్లమౌతుంది. జగత్తను పేరు గల దృశ్యము యొక్క మిథ్యాత్వ నిశ్చయమే పరమాత్మ తత్వము. మిథ్యాస్వరూపాలకంతటికీ, చలనం, లేక కదలికయే ఆశ్రయం.మూలకారణం. సాధనలో నిశ్చలత్వం పొందజాలక పరితపించే ఉత్తమ సాధకులకి ఇదంతా అనుభవైక వేద్యమే.

తానెప్పుడూ యదార్థంగా నిశ్చలుడే. తనలో సతతమూ 'నేనునేన'ని భాసించే తాను నిత్య, నిశ్చల, సత్యాత్మ స్వరూప చైతన్యము. ఉన్నది, ఉంటున్నది, ఎప్పుడూ ఉండేది అదొక్కటే అదితప్ప వేరేదీలేనిదే.

ఇక చంచలత్వంతో కూడిన మిథ్యా స్వరూపాలన్నీ కూడా తానే అవుతాడు. అవి తనకి భిన్నంగా ఎక్కడుండగలవు? తనకి గోచరించే, తాను అనుభవించే, చంచలతత్వంతో కూడిన స్వప్న జాతమంతా తానే కదా! స్వప్న కాలంలో మాత్రం అదంతా తనకి అన్యంగా, యథార్థంగా, చంచలంగా ఉన్నట్లు గోచరిస్తుంది. తానవన్నీ, యదార్థంగా నమ్ముతూ అనుభ

విస్తున్నాడు. స్వప్నానంతరం అదంతా మాయమై తానే మిగిలి ఉంటున్నాడు. అలాగే మెలకువ అన బడే జాగ్రదావస్థలో తనకన్యంగా తన అహంకారము, శరీరము, ప్రపంచము అనేక అనుభవాలతో ఉన్నట్లు భాసించడం, తనకు నిద్ర అనే మరొక అవస్థ సంప్రా ప్తించిన తక్షణం అవన్నీ మాయమై, తానే మిగిలి ఉండడం అందరికీ నిత్యానుభవమే. ఇక సుషుప్తి అని పేర్కొనబడే నిద్రావస్థలో ఏ చలనక్రాంతులూ లేక, తమోమయ స్వరూపుడై తానే ఉంటున్నాడు. ఈ రీతిగా, త్రివిధావస్థల్లోనూ తానుంటూ, ఆ అవస్థలు కేవలం మిథ్యాస్వరూపాలు, అబద్ధమైనవీ అవడంచేత, అవికూడా తానే అయివుంటునాడు. అవి తనకంటే భిన్నమైనవికావు. అందుకే నిశ్చలము, చంచలము ఒకటే అని అవగాహన చేసుకోవాలి. నిశ్చలమే తన నిజస్వభావమని, చంచలమే తన మాయాస్వరూప మని సాధకుడు గ్రహించుకోగలగాలి. సామాన్య సాధకులకు ఇది అవగాహన అవడం, వారి తత్వ గ్రాహ్య సామర్థ్యంపైన ఆధారపడి ఉంటుంది.

సాధకుడు తన యదార్థ స్థితిలో ఇపుడు తానులేడని సులువుగా గమనించ గలడు. తన యదార్థస్థానమైన హృదయస్థలినుంచి కదలి పోయి ఎక్కడెక్కడో సంచరిస్తున్నాడు. ఇలా సంచారంచేసే తననే తాను ఆదొక మనస్సనేదిగా, తనకన్యమైన దానినిగా అన్వయించుకుంటూ, భావించుకుంటున్నాడు. ఇది అత్యంత ఆశ్చర్యకరమైన భావన. తనకన్యంగా, తనలో తన మన్సనేది ఇంకొకటున్నదనుకొనడం ఎంత హాశ్యాస్పదం!

తనసహజ, స్వభావ, స్వరూపస్థితిలో తాను లేకపోవడమే ఈ మెలకువ అనబడే జాగ్రత్తు. స్వప్నం అనబడేదికూడా, కొద్ది తేడాతో ఉన్నట్లున్నా అదీ అలాటిదే. సుషుప్తి అనబడే నిద్రలో తన సహజ స్థితిలో నిలకడగా కొద్దిసేపు తానున్నా, అది తమస్సనే ముసుగుతో కప్పబడివుండి, తాను మరుగయే ఉన్నాడు. ఇలా, తన సహజ, స్వభావ, స్వరూపమైన పరమాత్మ చైతన్యానుభావాన్ని తాను కోల్పోయి నాడు. ఈ విధంగా తన యదార్థ స్వరూపానుభావాన్ని తాను కోల్పోయివుండటం అనాదిగా

జీవత్వమని పేర్కొనబడింది. జీవత్వం ఆవహించిన వారే జీవులనబడతున్నారు.

మెలకువ అనుకూంటూ నిదురించిన తరువాత లేవడం నిజమైన మెలకువకాదని తెలుసుకోడం వివేక లక్షణం. నిజమైన మెలకువ తానీ దేహాన్ననుకునే అహంకార పరమైన అజ్ఞానం నుంచి తన స్వరూప స్థితిలోకిని రావడము. ఆ మెలకువ వివేకవైరాగ్యాది సాధన సంపత్తితో తత్వ విచారం కొనసాగిస్తే సం ప్రాప్తిస్తుంది. తత్వం అంటే తత్ = అది, త్వం = నీవే అని. దేనినైతే తాను సాధించవలెనని ప్రయత్నంతో వున్నాడో అది తానే అయివున్నాడు. కనుక, ఉత్తమ ఆధ్యాత్మిక సాధకుడికి తన సాధనలో అతి ప్రధాన మైనదీ, సాధన లక్ష్యమైనదీ తానే. తానంటే ఆత్మస్వ రూపము. సాధించుటకు భగవంతుడు తనకి (ఆత్మకి) అన్యుడుకాడని, సాధకుడు తొలుదొల్త నిర్ధారణ చేసుకోవడం అవసరం. నిరాకార, అపరిచ్ఛిన్న స్వరూ పుడై, తనకన్యంగాలేని ఆ భగవత్ స్వరూపుని, తన కన్యునిగా, ఆకారునిగా భావించడానికి వివేకశూన్యమే కారణం. యదార్థంగా తన కన్యమైనవన్నీ, తన

శరీరంతో సహా, అప్రధానమైన. అనిత్యమైన అనాత్మ పదార్థాలు. అవన్నీ ఉనికి, విలువ లేనివి, స్వప్న దృశ్యాలకు, స్వప్నానుభవాలకు ఏమి ఉనికి, విలువ ఉంటుంది? అటువంటివే జాగ్రదవస్థలో మానవుని మనుగడకు సంబంధించిన శరీర జగత్తులు. వాటి నుండి విడుదల పొందడమే ముక్తి అనబడుతుంది. ఏ సాధన ఆచరించినా దాని కొరకే. సాధించడానికీ, పొందడానికీ సాధకుడికి భిన్నమైనదేదీ లేదు. దేహా తీత, లోకాతీతమై, అభౌతికమై, అన్నిటికీ ఆధారంగా వుండే ఆ భగవత్ స్వరూపమే తన యదార్థ స్వరూపం. దానినే ఆత్మ అని పేర్కొంటారు.

ఆత్మ ఎల్లప్పుడూ ఉంటూన్న సత్య స్వరూపము. తత్వవిచార సాధనవల్ల విషయ ప్రపంచం పూర్తిగా విలయమైతే, ఇక మిగిలేది ఆత్మయే, జ్ఞాన దీప్తిచే స్వప్రకాశమానమై వెలుగుతూండేది.

> 'యత్రనాన్యత్ పశ్యతి, నాన్యత్ శ్రుణోతి
> నాన్యత్ విజానాతి, తద్ భూమా'

అని ఉపనిషత్తులలో ఆత్మస్థితి వివరింపబడింది. అంటే, ఎచట ఎవరూ తమకన్యంగా దేనినీ చూడరో,

వేరేదీ వినరో, ఇతరమేమీ ఎరుగరో ఆ పరమ మౌన స్థితియే ఆత్మ. అది అనిర్వచనీయము, నిర్వికారము. ఆకాశతుల్యము. అదొక్కటే ఉన్నదని, వేరంతా మిథ్యయని, అదే తమయదార్థ స్థితియని, అవగాహన చేసుకుని దాని అనుభూతి పొందటమే అపరోక్ష జ్ఞానము. లేక అపరోక్షానుభూతి.

ఈ సందర్భములో వివేక చూడామణిలో శిష్యుణ్ణి జగద్గురువులు ఏ రీతిగా ప్రభావితుణ్ణి చేశారో గమనార్హం :

అజ్ఞాన యోగాత్పరమాత్మన స్తవ
హ్యనాత్మబన్ధ స్తత ఏవ సంసృతిః।
తయోర్వివేకో దితబోధవహ్ని
ర జ్ఞాన కార్యం ప్రదహేత్సమూలమ్ ॥

తా॥ అజ్ఞానం వల్ల నీకు 'శరీరమే నేను' అనే ధ్యాస కలిగింది. ఇలా దేహాత్మభావం కలగడంతో జగద్భ్రాంతి ఆవహించి నీ చేతనే ఈ కార్యక్రమాలన్నీ చెయ్యబడుతున్నాయనే అహంకారపరమైన సంసారభ్రమ కలిగింది. అంతేకాని నువ్వు శరీరానివి కావు. యదార్థంగా నువ్వు నిరాకార నిర్వికార, సుద్ధ,

ఋద్ధ పరమాత్మస్వరూపుడవు. నీ ఆధ్యాత్మిక సాధన ఫలించి, నీకు ఆత్మానాత్మ వివేకం కలుగుతే, నీలో స్వస్వరూపమైన అపరోక్షజ్ఞానం అనే అగ్ని జనించి, అజ్ఞాన కార్యాలనన్నింటినీ వేళ్ళతో సహా దహించి వేస్తుంది.

ఎవడైతే తానెవరో, దేహాతీతంగా ఉంటూ, 'నేను నేన'ని తనలో సతతము స్ఫురిస్తూ ఉంటున్న తన నిజ స్వరూపం ఏదో, తానునిజమని నమ్ముతూన్న ప్రపంచం యొక్క యదార్థ స్వరూపమేదో, జనన మరణాల యదార్థం ఏమిటో గ్రహించుకుంటున్నాడో, వాడే అసలైన దైవభక్తుడు, యోగి, జ్ఞాని. వీటిని గురించి అవగాహన చేసుకునే ప్రయత్నంలో ఎల్లప్పుడూ వుంటూ, ఇతర లౌకిక కార్యక్రమాల్లో ఎంత మాత్రమూ తలదూర్చక, తత్వవిచార పరాయణుడై, ఎవడైతే సక్రమమైన సాధనానికి పూనుకున్నాడో, అప్పటి నుంచీ, అటువంటి సాధక మహాశయుడికి అన్నీ శుభదినాలే. ఇటువంటి సుభంకరమైన ప్రయత్నం చేపట్టక, ఇతర కార్యకలాపాలతో కాలాన్ని

నంద వైభవం శేషిస్తుంది. ఈ ఆత్మానంద వైభవమే పురుషార్థము, మహా ఐశ్వర్యము, సర్వోత్కృష్టము. ఈ పవిత్ర గ్రంథంలో వివరింపబడిన ఉత్తమ తత్త్వ విచారసాధన నిరంతరము అంతఃకరణలో అలవరచు కొని అనుష్టానము చేయు సాధకమహాశయుడు సర్వ దృశ్యాకార జగత్తును అనిత్యముగ (మిధ్యగ) గ్రహిం చుచు, కాలక్రమమున స్వయంస్ఫురణ వల్లనే ఆత్మ ప్రసన్నమై, అపరోక్షానుభూతి పొందగలుగును.

ప్రార్థన

యస్మి న్సర్వం యతః సర్వం
యః సర్వం సర్వ తశ్చయః।
యశ్చ సర్వమయో నిత్యః
తస్మై సర్వాత్మనే నమః॥

తా॥ దేని యందు సమస్తము కలదో, దేని నుండి సమస్తము ఆవిర్భవిస్తున్నదో, ఏది సమస్తము అయియున్నదో, ఏది అంతటా వ్యాపించి యున్నదో

ఏది సర్వమయమై యొప్పుచున్నదో అట్టి సర్వ స్వరూప మగు ఆత్మకు సదా నమస్కారము. (సమస్త మనగా మిథ్యా స్వరూప జగత్తు)

ఇట్లు

ముముక్షువుల హితాభిలాషి

భాగవతి రామమోహనరావు

మహామంత్రం

దేహ మనిత్యం లోక మసత్యం
దేహో నాహం బ్రహ్మైవాహం।
బ్రహ్మం సత్యం బ్రహ్మం నిత్యం
ఏకం బ్రహ్మం సర్వం బ్రహ్మం॥

మంత్రార్థ వివరణ

ఈ మహా మంత్రం సర్వ వేదాంత సిద్ధాంతసార సంగ్రహం. అన్నిమంత్రాలూ చిట్టచివరికి ఈ మంత్రం దగ్గరకే వచ్చి చేరుకుంటాయి.

స్థూల శరీరం స్వయంగా సత్తాస్ఫూర్తులు లేని, పాంచ భౌతిక పదార్థ సమ్మేళనము. అందుచేత అది అనిత్యమై, ఎప్పుడైనా నశించిపోయేది. సూక్ష్మ శరీరం జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారంతో కూడిన అంతఃకరణ. ఇది చంచల స్వభావం కలిగి, మార్పులు చెందుతూ, అనేక వికారాలతో కూడిన అసద్రూపం. ఈ స్థూల, సూక్ష్మ శరీరాలని గురించి, ప్రపంచం యొక్క యదార్థాన్ని గురించి ఏమీ తెలియని

అజ్ఞానంలో ఉన్నానని, తనకి తెలియబడుతున్న స్థూల, సూక్ష్మ శరీరాలకు తాను ద్రష్టనని తన శరీరం తన నిజ స్వరూపం ఎంత మాత్రం కాదని గుర్తించుకుని, తదివర్తన పొందడం వివేకానికి ప్రథమ లక్షణం.

పంచేంద్రియాల ప్రవృత్తివల్ల గోచరించే భౌతిక ప్రపంచం మెలకువ అనబడే జాగ్రదావస్థకు పరిమితమైనది. అది అనిత్యమైన మాయా స్వరూపం (*Illusion*), శాశ్వతమైన ఉనికి సత్తా దానికి లేవు స్వప్నావస్థలోని దృశ్య విషయాలవలెనే, అది కూడా అసత్యమైన మిధ్యా స్వరూపం తప్ప యదార్థమైనది కాదని అవగాహన కలగడం వివేకానికి ద్వితీయ లక్షణం।

"ఇది నా శరీరం" అని దేహాన్ని తనకి అన్యమైన దానినిగా వ్యవహరించు కుంటూనే ఉంటాడు, కనుక, "నేను" అనేది ద్రష్ట, అంటే, తెలుసుకునే వాడని, దేహమనేది దృశ్యం, అంటే తెలుసుకోబడేదని స్పష్టంగా తనకు అనుభవ గ్రాహ్యమై సిద్ధించి వుండడం వివేకజ్ఞానానికి ప్రధాన లక్షణం,

తాను స్థూల, సూక్ష్మ శరీరాలకి విలక్షణుడనని, భిన్నుడనని గాఢమైన విశ్వాసం ఎప్పుడైతే కలుగుతుందో, అప్పుడు తన యదార్థ స్వరూపమైన ఆత్మతత్వం అవగాహన అయి, అవా

జ్ఞానస గోచరము, చైతన్యస్వరూపము అయిన సద్వస్తువు (బ్రహ్మ జ్ఞానం) ఉదయిస్తుంది. బ్రహ్మస్వరూపుడైన తానుతప్ప తన కన్యమైనవన్నీ, తన శరీరంతోసహా, అనిత్యమైన మిథ్యా స్వరూపములని నిత్యానిత్యవస్తు వివేకం స్పష్టంగా అనుభూతి అయి, అహంకార పరమైన జీవన భ్రాంతి తొలంగిపోతుంది. తనను దేహాతీత, నాశరహిత, నిత్య, సత్యాత్మ స్వరూపునిగా గుర్తింతుకుని దివ్యానుభవాన్ని పొందగలుగుతాడు.

తన నిజస్వరూపమైన ఆ పరబ్రహ్మం యదార్థంగా శాశ్వతంగా ఎప్పుడూ అంతటా ఉంటూన్న చైతన్యానంద స్వరూపము. అది తప్ప వేరేదీలేదు. తాననేది లేని శాశ్వతము, సర్వ వ్యాపకము నాశరహితము, అగోచరము, అనంత, అద్వయా నంద స్వరూపము అయిన ఆ పరబ్రహ్మం ఒక్కటే పరిపూర్ణ పరమ శాంత స్వరూపమై విరాజిల్లుతున్నది.

మహా యజ్ఞం

మాయా స్వరూపమైన ప్రపంచంలో, అహంకార మమకారాంతో, ఏ కర్మలు చేసినా, అర్థరహితములే. అవి ఆధ్యాత్మిక ప్రయోజనము, ప్రగతి కలుగజేసేవి ఎలా అవుతాయి?

దేహాత్మబుద్ధితో బాహ్యంగా ఆచరించే యజ్ఞయాగాలు, వ్రతాలు, పూజలు, తపస్సులు, ప్రార్థనలు భజనలు తీర్థయాత్రలు మొదలైనవి కొంత మనశ్శాంతి, చిత్తశుద్ధి, క్రమశిక్షణ కలిగించుటకు తోడ్పడగలవే కాని, ఆత్మజ్ఞాన సిద్ధి కలిగించవు. ఇలాంటివన్నీ బహిర్యాగములు. యజ్ఞకర్మలు, పుణ్యకార్యములు మొదలైన బహిర్యాగములన్నీ నిజానికి దుర్బలాలైన ఓటు పడవల వంటివని, అవే సర్వోత్కృష్టమైనవి భావిస్తూ, వాటిమీదే ఆసక్తి కలిగి, వాటికి మించినదేదీ లేదనుకునేవారికి జ్ఞానోదయం కలుగదని, ఆ కర్మల ఫలములైన స్వర్గలోక సుఖాల అనంతరం మళ్ళీ వారికి అధోగతేననీ ఉపనిషత్తులలో స్పష్టం చెయ్యబడింది. వ్యాసభగవానుడు ప్రసాదించిన 'గురు గీత' లో కూడా ఇదే విధంగానే విశదం చేశాడు. భగవంతుడనబడే ఆత్మస్వరూపము మంచీ, చెడూ, వంటి అన్ని ద్వంద్వాలకీ అతీతము అభౌతికము. అహం జ్ఞానస్గోచరము. మాయా స్వరూపమైన ప్రపంచంలో, మంచి పనులనుకునేవికూడా ఆధ్యాత్మికంగా అనర్థదాయకములే అవుతాయి. అన్ని కార్యములకీ, మంచివికాని, చెడ్డవికాని అహంకార పరమైన సంకల్పాలు బీజాలౌతాయి. అన్ని సంకల్పాలకీ మూలం ఆశ. ఆకాంక్ష. సంకల్ప సూన్యస్థితి పొంది, ఆత్మానుభూతి సిద్ధించడానికి, ఇవన్నీ అవరోధాలే అవుతాయి కదా! ఇటువంటి బహిర్యాగాలు ఎన్నెన్ని

ఎంతకాలం ఆచరించినా జ్ఞానోదయం కలుగదు. ఈ శుష్క బాహ్యాచరణలన్నిందినీ అలక్ష్యంచేస్తూ, అంతరంగిక దృక్పథం అలవరచుకొని, హృదయస్థలిలో సంప్రాప్తమయే ఆత్మానుభవం వైపునకు దృష్టి మళ్ళించి, అభ్యసించే ఆత్మవిచార సాధన యదార్థమైన ఆధ్యాత్మిక సాధన అవుతుంది. ఈ అంతర్యాగం వల్లనే ఫలప్రదమైన ఆధ్యాత్మిక సంపన్నత కలుగుతుంది. దీనిని స్వస్వరూపానుసంధానమని, నిధిధ్యాస అని, తత్వ విచారమని కూడా శాస్త్రాల్లో పేర్కొంటారు. శుష్కమైన అన్ని బాహ్యాచరణలూ చివరకు సాధకుణ్ణి ఈ అంతరంగిక అనుష్ఠానం దగ్గరకు తీసుకువస్తాయి.

తత్వమస్యాది మహా వాక్యాలు 'నీవే బ్రహ్మస్వరూపుడవై ఉన్నావు' అని ఆత్మానుభూతికి సరాసరి దారి చూపే మహత్తర తత్వాన్ని, సాధకుణ్ణి తట్టి బోధచేస్తున్నాయి. ఈ పరతత్వానుభూతిని అంతర్యాగం వల్ల పొందడమే ప్రజ్ఞానం. ఈ జ్ఞానోదయం వల్ల దేనివలనా సాధ్యం కాని, అజ్ఞానాంధకారమంతా పటాపంచలై అంతమౌతుంది. గోచరించే జడస్వరూపాలైన, ప్రపంచం, శరీరాలు, పంచేంద్రియాలు, అంతఃకరణచతుష్టయమనబడే మనఃస్చిత్త, బుద్ధ్యహంకారాలు, అన్నీ మిథ్యాస్వరూపాలు, అసత్యాలు తప్ప యధార్థాలు కావని, సర్వావస్థల

వెనుకా, వాటికి మూలమైవున్న పరతత్వం ఏకైక చైతన్యానంద స్వరూపమైన బ్రహ్మమేనని, అది తానే అయివున్నాడని దివ్యానుభవం సంప్రాప్తిస్తుంది. దేహాత్మభావం, పరిమితత్వం, వ్యక్తిత్వం మొదలైన కళంకములతో కూడిన జీవభ్రాంతి తొలగిపోయి విముక్తుడౌతాడు. సర్వాతీత, ఆత్మానంద స్వరూపుడైన తాను తప్ప ఇతరమంతా స్వప్నసమానమైన మిథ్యా స్వరూపమేకాని, యదార్థంకాదని అనుభవ గ్రాహ్యం కలిగి అందులో స్థిరత్వం సిద్ధిస్తుంది. ఇదే అపరోక్షజ్ఞానం, లేక సమ్యగ్జ్ఞానం. అంతరంగికంగా, స్వస్వరూపానుసంధానమనే ఆత్మధ్యానం నిరంతరంగా దృఢాభ్యాసం చేసుకుంటే, ఈ అపరోక్షజ్ఞానం సంప్రాప్తిస్తుంది. ఈ అంతర్యాగమే మోక్షోపాయకరమైన మహాయజ్ఞం.

మహా పుణ్యం

సామాన్యంగా మానవులచే భావింపబడే పుణ్య, పాపాలు మాయాస్వరూపమైన లౌకిక జీవితానికి సంబంధించినవి. ఆధ్యాత్మిక దృష్టిలో పాపం అంటే ఆత్మవిస్మృతి. పుణ్యం ఆత్మస్మృతి. ఆత్మ విస్మృతిలో ఉన్నంత కాలమూ దేహ, ప్రపంచాదుల భ్రాంతి తప్పదు. ఎప్పుడైతే ఆత్మస్మృతి (ఆత్మానుభూతి) సిద్ధిస్తుందో, అప్పుడీ 'మాయా స్వరూపాలైన దేహాలోకాల భ్రమ తొలగిపోతుంది.

నామ రూపాలతో పరిమితమైన ఆకృతిగల అనిత్యమైన శరీరమే తాననుకునే దేహాత్మభావమే అజ్ఞానమయమైన మహాపాపం, ఇంద్రియాలకి, మనస్సుకి గోచరించే దృశ్యప్రపంచం యొక్క నామరూపాలన్నింటినీ, స్వశరీరంతోసహా మిథ్యగా విస్మరిస్తూ, సంకల్ప వికల్పాల్నీ, విషయ ప్రవృత్తినీ వొదుల్చుకుంటూ, నిర్వికారంగా తన యాదార్థ స్వరూపమైన బ్రహ్మానుభవం కోసం సక్రమమైన సాధనానుష్ఠానం చేపట్టడమే యదార్థమైన పుణ్యకార్యం, సర్వోత్కృష్టమైన ఈ సాధనని స్వస్వరూపాను సందానమని, నిధిధ్యాస అని, ఆత్మ విచారమని వేదాంత శాస్త్రాలు పేర్కొన్నాయి. మహోన్నతమైన ఈ సాధన యొక్క అంశాలు ఈ పవిత్ర గ్రంథలో ఎంతో విపులంగా వివరింపబడ్డాయి. మోక్షోపాయకరమైన ఈ సాధనా భ్యాసమే మహా పుణ్యం. ఈ మహా పుణ్యకార్యాన్ని ఆచరిస్తే అతి దుర్లభమైన మనుష్యజన్మ సార్థకమౌతుంది.

ప్రార్థన

ఏ వివేక ప్రసాదముచే జ్ఞానోదయమై పూర్వపు అజ్ఞానమయమైన జీవభ్రాంతి తొలగి ఆత్మ స్వరూపానుభూతి సిద్ధించెనో, అట్టి వివేకమునకు నమస్కారము.

సర్వాతీతము, సర్వస్వరూపము, స్వస్వరూపము అయిన పరమాత్మకు నమస్కారము. ఈ సత్యస్వరూప జ్ఞానము ప్రబోధించు వేదాంత శాస్త్రములకు, సద్గురువులకు నమస్కారము.

శ్రీమత్పరబ్రహ్మ జగద్గురుం స్మరామి
శ్రీమత్పరబ్రహ్మ జగద్గురుం భజామి ।
శ్రీమత్పరబ్రహ్మ జగద్గురుం వదామి
శ్రీమత్పరబ్రహ్మ జగద్గురుం నమామి ॥

భాగవతి రామమోహనరావు



శృతి స్మృతి పురాణానా మాలయం కరుణాలయం
నమామి భగవత్పాద శంకరం లోక శంకరమ్।

ఓం

శ్రీ శంకర భగవత్పాద విరచిత

అపరోక్షానుభూతి

బ్రహ్మవిద్యా విధానము

(1)

శ్రీహరిం పరమానంద ముపదేష్టార మీశ్వరమ్ ।
వ్యాపకం సర్వలోకానాం కారణం నమామ్యహమ్ ॥

పరమానంద స్వరూపుడు, గురువులలో ప్రప్రథముడు, ఈశ్వరుడు, సర్వవ్యాపకుడు, ఏకైకస్వరూపుడు, సమస్తలోకకారకుడు అయిన శ్రీహరి పాద పద్మములకు ప్రణామము లర్పిస్తున్నాను.

(2)

అపరోక్షానుభూతిర్వై ప్రోచ్యతే మోక్షసిద్ధయే ।
సద్భిరేవ ప్రయత్నేన వీక్షణీయా ముహుర్ముహుః ॥

అజ్ఞానబంధం నుంచి నివృత్తి కలిగి, జీవిత పరమార్థమైన మోక్షం సిద్ధించడానికి దారిచూపే ఉద్దే

శంతో ఈ అపరోక్షానుభూతి ప్రసాదింపబడింది. చిత్త శుద్ధి, పవిత్ర హృదయంకల సాధకులు దీనిలో ప్రబో ధించిన పరమ సత్యాన్ని ప్రతినిత్యమూ పదే పదే శ్రద్ధాభక్తులతో ధ్యానం చేసుకోవాలి.

(3)

స్వవర్ణాశ్రమధర్మేణ తపసా హరితోషణాత్ ।
సాధనం ప్రభవేత్ పుంసాం వైరాగ్యాది చతుష్టయమ్ ॥

ఆత్మజ్ఞాన ప్రాప్తికి, సాధన చతుష్టయం అన బడే వైరాగ్యం, నిత్యానిత్యవస్తువివేకం, శమదమా దులు, ముముక్షత్వం ప్రథమ యోగ్యతలు. ఈ యోగ్యతలు ఇంద్రియసుఖాల్ని పరిత్యజించి, తమకు జీవితంలో నిర్దేసింపబడిన కర్తవ్యకార్యాల్ని చిత్త శుద్ధితో చేస్తూ, దైవానుగ్రహంకోసం శ్రీహరిని ఆరా ధించే మానవోత్తములకు సంప్రాప్తిస్తాయి.

(4)

బ్రహ్మాది స్థావరాన్తేషు వైరాగ్యం విషయేష్వను ।
యథైవ కాకవిష్ఠాయాం వైరాగ్యం తద్ధి నిర్మలం ॥

కాకిరెట్టని ఎంత అసహ్యంగా ఏవగింపుతో చూస్తారో, అలా బ్రహ్మాది పర్యంతమూ ఈ ప్రపంచంలో వుండే సమస్త విషయ సుఖభోగాలకి సంబంధించిన పదార్థాల్ని చూడడం అసలైన, నిర్మలమైన వైరాగ్యం.

(5)

నిత్యమాత్మ స్వరూపం హి దృశ్యం తద్విపరీతగమ్ ।
ఏవం యో నిశ్చయః సమ్యగ్వివేకో వస్తునః సవై ॥

సర్వసాక్షీ, సర్వాధిష్ఠానము అయిన పరమాత్మ స్వరూపం ఒక్కటే నిత్యమై ఎల్లప్పుడూ ఉండేదని, దానికి వ్యతిరిక్తమై విపరీతంగా ఉన్న దృశ్యజాతమంతా వట్టి అసత్యము, అనిత్యము, మిథ్యా స్వరూపము, స్వప్నతుల్యము అని తత్వవిచారణచే నిర్ధారణ చేసుకుని, నిశ్చయించుకోడం 'నిత్యానిత్యవస్తు వివేకం' లేక 'సమ్యగ్వివేకం' అని చెప్పబడుతోంది.

(6)

సదైవ వాసనాత్యాగః శమోయ మితి శబ్దితః ।
నిగ్రహో బాహ్యావృత్తీనాం దమ ఇత్యభిధీయతే ।

సర్వకాల సర్వావస్థలలోనూ, విషయాలలోని దోషాల్ని పరిశీలిస్తూ, వాటికి సంబంధించిన వాసనలన్నింటినీ విరక్తితో వొదుల్చుకోవడం 'శమ' మని పిలువబడుతోంది. ఇక కర్మేంద్రియాల్ని వాటి వాటి వ్యాపారాల లోకి పోనివ్వక, అరికడుతూ, వాటిని పరమాత్మ ధ్యానలో నిలపడం 'దమ'మని చెప్పబడుతోంది.

(7)

విషయేభ్యః పరావృత్తిః పరమోపరతిర్హి సా ।
సహనం సర్వదుఃఖానాం తితిక్షా సా శుభామతా ॥

చంచల స్వభావమైన మనస్సును విషయ చింతలలోంచి మళ్ళించి, తత్వవిచార సాధనలో నిలపడం 'ఉపరతి' అనబడుతోంది. సర్వదుఃఖాలనూ, బాధావమానాల వంటి అరిష్టాలనూ సహించి, ఎవరికీ మనోవాక్కాయకర్మలా ఎటువంటి ప్రతీకారమూ చెయ్యకుండా వుండడం 'తితిక్ష' అనబడుతోంది.

(8)

నిగమాచార్య వాక్యేషు భక్తిః శ్రద్ధేతి విశ్రుతా ।
చిత్తైకాగ్రంతు సల్లక్ష్యే సమాధానమితి స్మృతమ్ ॥

వేదాంత గ్రంథాలలోని అధ్యాత్మిక సిద్ధాంతాల పట్లా, వాటిని విస్తృతంగా ప్రబోధించే సద్గురువుల మాటల మీదా అత్యంత శ్రద్ధా, భక్తీ కలిగి ఉండడం "శ్రద్ధ" అనబడుతోంది. మనస్సును అన్యమొల్లని చిత్త ఏకాగ్రతతో సద్వస్తువైన పరమాత్మ స్వరూప చింతనలో నిమగ్నంచేసి ఉండడం 'సమాధానమని' భావించబడుతోంది.

(9)

సంసారబంధ నిర్ముక్తిః కథంమే స్యాత్ కదా విధే ।
ఇతి యా సుదృఢా బుద్ధిర్వక్తవ్యాసా ముముక్షుతా ॥

'ఓ భగవంతుడా! జనన, జరా, మరణాదులతో కూడిన ఈ సంసార బంధమనే అజ్ఞానపు భ్రాంతి నుంచి నాకెప్పుడు ఏ విధంగా విముక్తి కలుగుతుంది?' అని ఎల్లప్పుడూ తీవ్రతరమైన ఆందోళనతో సాధనేచ్ఛ కలిగి వుండడం 'ముముక్షత్వ' మనబడుతుంది.

(10)

ఉక్త సాధన యుక్తేన విచారః పురుషేణ హి ।
కర్తవ్యోజ్ఞాన సిద్ధ్యర్థ మాత్మనః శుభమిచ్ఛతా ॥

ఇలా చెప్పబడిన ఆధ్యాత్మికసాధనకు యోగ్యతలను సంపాదించుకుని, ఆత్మజ్ఞానప్రాప్తి కోసం అర్హుడైనవాడు నిత్యమూ, నిరంతరాయంగా తన ఆధ్యాత్మిక కర్తవ్యాన్నీ, శ్రేయస్సునీ గురించి తలపోస్తూ, లక్ష్యసిద్ధియైన పరమాత్మ స్వరూప చింతనలోనే నిమగ్నుడై ఉండాలి.

(11)

నోత్పద్యతే వినా జ్ఞానం విచారేణాన్య సాధనైః ।
యథా పదార్థభానం హి ప్రకాశేన వినా క్వచిత్ ॥

చీకటిలో వున్న వస్తువు దీపసహాయంతోనే గోచరిస్తుంది తప్ప ఏ ఇతర సాధనములవల్లా అది కనిపించలేదు. అలాగే ఆత్మజ్ఞానం, తత్వవిచార సాధన (నిధిధ్యాస) వల్లనే జనిస్తుంది తప్ప ఏ ఇతర కార్యకలాపాల వల్లా అది సిద్ధించదు.

(12)

కోఽహం కథమిదం జాతం కోవైకర్తాస్య విద్యతే ।
ఉపాదానం కిమస్తీహ విచారః సోఽయమీదృశః ॥

'నే నెవడను? ప్రతినిత్యమూ నా అనుభవం లోకి వస్తున్న ఈ జాగ్రత్, స్వప్న, సుషుప్తులనబడే అవస్థలు ఎలా సృష్టింపబడి, సంభవిస్తున్నాయి? వాటికి కారకుడూ, సృష్టికర్తా ఎవరు? జాగ్రత్, స్వప్నావస్థలలోని దృశ్య, స్వప్న ప్రపంచ జాతమంతా ఏపదార్థ నిర్మితమై అలా గోచరిస్తోంది?' ఈ విధంగా విచారణ కొనసాగించాలి.

(13)

నాహం భూతగణో దేహో నాహంచాక్షిగణ స్తథా ।
ఏతద్విలక్షణః కశ్చిద్విచారః సోఽయ మదృశః ॥

''పంచభూత సమ్మేళనమై, వట్టి జడ పదార్థదాయకమైన ఈ స్థూలదేహం నేను కాదు.

శబ్ద, స్పర్శ, రూప, రసగంధాలనే పంచేంద్రియ కూటమి అయిన సూక్ష్మశరీరం కూడా నేను కాదు.

నేను వీటన్నిటికీ భిన్నుడను, విలక్షణుడను అయి వున్నాను." ఈ విధంగా స్వస్వరూప నిర్ణయ విచారణ కొనసాగించుకోవాలి.

(14)

అజ్ఞాన ప్రభవం సర్వం జ్ఞానేన ప్రవిలీయతే ।
సంకల్పో వివిధః కర్తా విచారః సోఽయమీదృశః ॥

శరీర ప్రపంచాదులతో గోచరించే ఈ దృశ్య జాతమంతా అజ్ఞానంతో కూడిన భ్రాంతివల్లనే అలా భాసిస్తోంది. జ్ఞానోదయమైన వెంటనే అదంతా వట్టి అసత్యమైన మిథ్యా స్వరూపమని విదితమౌతుంది. అంతఃకరణలో జనించే నానా విధ సంకల్ప వికల్పాలూ వీటన్నిటినీ సృష్టిస్తూ, వీటికి కారణమౌతున్నాయని తెలివి కలుగుతుంది.

(15)

ఏతయోర్య దుపాదాన మేకం సూక్ష్మం సదవ్యయమ్ ।
యదైవ మృద్ ఘటాదీనాం విచారః సోఽయ మీదృశమ్ ॥

మట్టితో తయారయే కుండ మొదలైన వస్తువులన్నీ యదార్థంగా మట్టే అయినట్లు ఈ రెండూ, అంటే, అజ్ఞానము, దానివల్ల జనించే సంకల్ప వికల్పాలూ, సూక్ష్మము ఏకైక స్వరూపము అయి ఎల్లప్పుడూ అంతటా వుండే సచ్చిదానంద పరబ్రహ్మమే.

(16)

అహమేకోఽపి సూక్ష్మశ్చ జ్ఞాతా సాక్షీ సదవ్యయః।
తదహం నాత్ర సందేహో విచారః సోఽయమీదృశః॥

'అందుచేత ఏకైక స్వరూపము, సూక్ష్మము, సర్వజ్ఞాత, సర్వసాక్షి, ఎల్లప్పుడూ అంతటా ఉంటూండే అవ్యయము అయిన ఆ సచ్చిదానంద పరబ్రహ్మాన్ని నేనే అయివున్నాను. ఇందులో ఎంత మాత్రమూ, ఎటువంటి సందేహమూ లేదు.' ఈ విధమైన విచారణ ద్వారా స్వస్వరూప నిర్ధారణ చేసుకోవాలి.

(17)

ఆత్మా వినిష్కలో హ్యేకో దేహో బహుభిరావృతః
తయోరైక్యం ప్రపశ్యంతి కిమజ్ఞాన మతః పరమ్ ॥

ఆత్మ ఎటువంటి విభాగాలూ లేని కేవల ఏకైక స్వరూపం. దేహమో, అనేక పదార్థాలు, అవయవాలు అనే విభాగాలు కలిగి వుంది. అయినప్పటికీ, మానవులు దేహాన్నీ, ఆత్మనీ ఒకటిగానే భావిస్తూ మసుగడ సాగిస్తున్నారు. ఇంతకంటే వేరే అజ్ఞానం ఏముంటుంది?

(18)

ఆత్మా నియామకశ్చాంతర్ దేహో బాహ్యో నియమ్యకః।
తయోరైక్యం ప్రపశ్యంతి కిమజ్ఞాన మతః పరమ్ ॥

ఆత్మ అంతర్యంలో నిరాకారంగా అధిష్ఠానమై వుంటూ పరిపాలించే ప్రభువు. దేహం బాహ్యంగా, ఆకారం కలిగి వుంటూ పాలింపబడేది. అయినా, మానవులు ఈ రెండింటినీ ఒకటిగానే భావిస్తూఉంటున్నారు. ఇంతకంటే అజ్ఞానం వేరే ఏముంటుంది?

(19)

ఆత్మా జ్ఞానమయో పుణ్యో దేహో మాంసమయో సుచిః।
తయోరైక్యం ప్రపశ్యంతి కిమజ్ఞానమతః పరమ్ ॥

ఆత్మ జ్ఞానమయమైన ఎరుక. అతిపవిత్రమైనది. దేహమంతా రక్తమాంసాది అశుద్ధ పదార్థాలతోకూడి అపవిత్రమైనది. అయినా ఈ రెండింటినీ ఒకటిగానే భావిస్తున్నారు. ఇంతకంటే అజ్ఞానం మరేముంటుంది?

(20)

ఆత్మా ప్రకాశకః స్వచ్ఛో దేహస్తామస ఉచ్యతే ।
తయోరైక్యం ప్రపశ్యంతి కి మజ్ఞాన మతః పరమ్ ॥

ఆత్మ స్వయంప్రకాశము, అత్యంతపరిశుద్ధము, నిర్మలము అయివుంది. దేహము స్వయంగా సత్తా స్ఫూర్తులు లేని అంధకారమయమై వుంది. కనుక తామసమని చెప్పబడుతోంది. అయినా జనులు దేహాన్నీ ఆత్మనీ ఏకంగా భావిస్తూ, తాము దేహాల మని అనుకుంటున్నారు. ఇంతకంటే అజ్ఞానం ఏముంటుంది?

(21)

ఆత్మా నిత్యోహి సద్రూపో దేహో నిత్యో హ్యసన్మయః
తయోరైక్యం ప్రపశ్యంతి కి మజ్ఞాన మతః పరం ॥

ఆత్మ నిత్యమై కేవలము సత్య స్వరూపమై వుంది. దేహమో, అనిత్యమైన వట్టి మిథ్యాస్వరూపము. అయినా! ఈ రెండింటినీ, ఏకంగా భావిస్తున్నారు. ఇంతకంటే వేరే అజ్ఞానం ఏముంటుంది?

(22)

ఆత్మ న స్తత్ ప్రకాశత్వం యత్పదార్థావభాస నమ్ ।
నాగ్న్యాది దీప్తి వద్దీప్తిర్భవ త్యాంధ్యం యతో నిశి ॥

సమస్త దృశ్య జాతాలూ దేని ప్రకాశం వల్ల తెలియబడుతున్నాయో, అటువంటి ఆత్మ ప్రకాశం అగ్ని మొదలైన వాటి దీప్తి ప్రకాశం వంటిది కాదు. అగ్ని, సూర్యుడు మున్నగువాటి ప్రకాశాలు పరిమితమైనవవడంచేత, అవి వున్నా, చీకటి కొన్నిచోట్ల వుండనే వుంటుంది.

(23)

దేహోహ మిత్యయం మూఢో ధృత్వా తిష్ఠంత్యహో జనః।
మమాయ మిత్యపి జ్ఞాత్వా ఘటద్రష్టేవ సర్వదా॥

ఒక కుండను చూసేవాడు ఆ కుండ తనకంటే భిన్నమైందని తెలుసుకునేటట్లు, ఈ దేహం తనకు చెందిన, అన్యమైన ఒక వస్తువని తెలుసుకుని కూడా మూఢమానవుడు ఈ దేహమే తాననుకుని అజ్ఞానంతో ఉంటున్నాడు. ఇది ఎంత ఆశ్చర్యం?

(24)

బ్రహ్మైవాహం సమః శాంతః సచ్చిదానంద లక్షణః
నాహం దేహో హ్యసద్రూపో జ్ఞాన మిత్యుచ్యతే బుధైః॥

'నేను కేవలము బ్రహ్మస్వరూపుణ్ణి, సమమైనవాడను. శాంత స్వభావుడను. సచ్చిదానందమే నా లక్షణం. నే నీదేహాన్ని కాను. ఎందువలననంటే ఆది అసద్రూపమైనది' ఇలా గ్రహించుకోవడమే యదార్థమైన జ్ఞానమని పండితులు తెలుపుతున్నారు.

(25)

నిర్వికారో నిరాకారో నిరవద్యోఽహ మవ్యయః ।
నాహందేహో హ్యసద్రూపో జ్ఞానమిత్యుచ్యతే బుధైః॥

'నేను ఏ మార్పు చెందని నిర్వికార స్వరూపుడను. నిరాకారుడను. నిర్మలుడను. నాశరహితుడను. అసద్రూపమైన ఈ దేహం నేను కాదు' వివేకంతో కూడిన ఇలాంటి తెలివి ఉదయించడమే జ్ఞానమని ఆత్మనిష్ఠులైన పండితులు తెలుపుతున్నారు.

(26)

నిరామయో నిరాభాసో నిర్వికల్పోఽహ మాతతః।
నాహందేహో హ్యసద్రూపో జ్ఞానమిత్యుచ్యతే బుధైః॥

'నేనుకోగాలేవీ సంక్రమించని వాడను. దృశ్యాతీతుడను. సంకల్ప వికల్పాలు లేనివాడను. సర్వవ్యాపకుడను. అసద్రూపమైన ఈ దేహాన్ని నేను కాను.' ఇటువంటి అనుభవగ్రాహ్యమే జ్ఞానమని పండితులచే చెప్పబడింది.

(27)

నిర్గుణో నిష్క్రియో నిత్యో నిత్యముక్తోఽహమచ్యుతః।
నాహందేహో హ్యసద్రూపో జ్ఞానమిత్యుచ్యతే బుధైః॥

'నేను గుణరహితుడను, క్రియా శూన్యుడను, నిత్యమైన వాడను. (ఎల్లప్పుడూ ఉండే వాడను.) నిత్యముక్తుడను. నాశములేని సచ్చిదానంద స్వరూపుడను. అసద్రూపమైన ఈ దేహాన్ని నేను కాను.' ఈ విధమైన అవగాహన జ్ఞానమని పండితులు చెబుతున్నారు.

(28)

నిర్మలో నిశ్చలోఽనంతః శుద్ధోఽహ మజరోఽమరః।
నాహం దేహో హ్యసద్రూపో జ్ఞానమిత్యుచ్యతే బుధైః॥

'నేను అజ్ఞానం వల్ల కలిగిన మాలిన్యం ఎంత మాత్రమూ లేనివాడను; నిశ్చలమైన వాడను; అనంతుడను. పరిశుద్ధమైన వాడను; వ్యాధులు, వృద్ధత్వము లేనివాడను; మృత్యువు లేని అమరుడను. అసద్రూపమైన ఈ శరీరాన్ని నేను కాను.' ఈ విధమైన తత్వ నిర్ణయమే జ్ఞానమని పండితులచే చెప్పబడుతోంది.

(29)

స్వదేహే శోభనం సంతం పురుషాఖ్యం చ సమ్మతం।
కిం మూర్ఖశూన్యమాత్మానం దేహాతీతం కరోషి భోః॥

ఓయీ! మూర్ఖుడా! నీ దేహంలోనే ఆనంద స్వరూపుడై పురుషుడనే పేరుతో స్మృతులలో పర బ్రహ్మస్వరూపుడని సమ్మతింపబడి దేహాతీతుడై వుంటున్న ఆత్మను అసలే లేని వానినిగా విస్మరించి ఎలా ఉండ గలుగుతున్నావు?

(30)

స్వాత్మానం శృణు మూర్ఖత్వం శ్రుత్యా యుక్త్యాచ పూరుషమ్
దేహాతీతం సదాకారం సుదుర్దర్శ్యం భవాదృశై ॥

అజ్ఞానివైన ఓ మూర్ఖుడా! శ్రుతులలో చెప్ప బడిన సిద్ధాంతాలచేతా, విచారణా యుక్తులవల్లా, ఈ దేహానికి విలక్షణుడై, సత్యస్వరూపుడైవుంటున్న పురు షుడనబడే నీ ఆత్మస్వరూపాన్ని తెలుసుకోడానికి (ఆత్మానుభూతి పొందడానికి) ప్రయత్నించు. నీబోటి అజ్ఞానులకి దాన్ని అవగాహన చేసుకోవడం బహు కష్టసాధ్యమే.

(31)

అహం శబ్దేన విఖ్యాత ఏక ఏవ స్థితః పరః ।
స్థూల స్త్వనేకతాం ప్రాప్తః కథం స్యాద్దేహకః పుమాన్॥

"నేను" అని భాసించే అహం శబ్దవాచ్యుడైన పరమాత్మ, ఒక్కడే, ఏకైక స్వరూపుడై వుంటున్నాడు. అయితే ఈ స్థూలమైన శరీరాలు, పదార్థాలు అనేకం వుంటున్నట్లు గోచరిస్తున్నాయి. అలాటప్పుడు ఈ దేహం పురుషుడు ఎలా అవుతుంది?

(32)

అహం ద్రష్టృతయా సిద్ధో దేహో దృశ్యతయా స్థితః।
మమాయమితి నిర్దేశాత్ కథం స్యాద్దేహకః పుమాన్॥

'నేను' అనేది ద్రష్ట, అంటే, తెలుసుకునే వాడని. ఈ దేహమనేది దృశ్యం, అంటే, తెలుసుకోబడేదని స్పష్టంగా తెలిసిపోతూ సిద్ధించి వుంది.

'ఇది నా శరీరం'. అని అంటూ మన దేహాన్ని మనకు భిన్నమైన దాన్నిగా వ్యవహరించుకుంటూనే వున్నాము. అలాటప్పుడు ,ఈ దేహం ఆత్మస్వరూపమైన పురుషుడు ఎలా అవుతుంది?

(33)

అహం వికార హీనస్తు దేహో నిత్యం వికారవాన్।
ఇతి ప్రతీయతే సాక్షాత్ కథంస్యాద్దేహకః పుమాన్॥

"నేను" అని అందరిలో భాసించే ఆత్మ (పురుషుడు) ఎటువంటి మార్పులూ లేక నిర్వికారిగా వుంటుందని, దేహం వికారాలతో ఎల్లప్పుడూ మార్పులు చెందుతూ ఉంటుందని ప్రత్యక్షానుభవంగా యదార్థమైన విషయం. అలాటప్పుడు, ఈ దేహం నిర్వికారుడైన పురుషుడు ఎలా అవుతుంది?

(34)

యస్మాత్ పరమితి శ్రుత్యా తయా పురుషలక్షణమ్।
వినిర్ణీతం విమూఢేన కథం స్యాద్దేహకః పుమాన్॥

అంతా తానే అయి పరిపూర్ణుడై వుంటున్న పురుషుడి లక్షణాలు శ్రుతులలో (ఉపనిషత్తులలో) స్పష్టంగా నిశ్చయించి చెప్పబడ్డాయి. అటువంటప్పుడు, ఓయీ మహా మూఢుడా! ఈ శరీరం పురుషుడు (ఆత్మ) ఎలా అవగలదు?

(35)

సర్వం పురుష ఏవేతి సూక్తే పురుష సంజ్ఞితే ।
అప్యుచ్యతే యతః శ్రుత్యా కథం స్యాద్దేహకః పుమాన్ ॥

శ్రుతుల లోని పురుషసూక్తంలో కూడా ఈ సమస్తమూ పురుష స్వరూపమే అని చెప్పబడింది. అందుచేత ఈ దేహం పురుష డెలా అవుతుంది?

(36)

అసంగః పురుషః ప్రోక్తో బృహదారణ్యకేఽపి చ ।
అనంత మలసంశ్లిష్టః కథం స్యాద్దేహకః పుమాన్ ॥

బృహదారణ్యకోపనిషత్తులో కూడా పురుషుడు సంగరహితుడని, దేనినీ అంటనివాడని చెప్పబడింది. అటువంటప్పుడు, ఎన్నో మలిన పదార్థాలతో కూడి వున్న ఈ శరీరం పురుషుడెలా అవుతుంది?

(37)

తత్రైవచ సమాఖ్యాతః స్వయంజ్యోతిర్హి పూరుషః ।
జడః పరప్రకాశ్యోఽయం కథం స్యాద్దేహకః పుమాన్ ॥

పురుషుడు స్వయంప్రకాశ స్వరూపుడనికూడా బృహదారణ్యకోపనిషత్తులో చెప్పబడింది. ఈ దేహం స్వయం సత్తా స్ఫూర్తులు లేని జడ పదార్థ నిర్మితమై, ఇతర ప్రకాశంవల్ల తెలియబడుతోంది. అటువంటి దేహం పురుషుడెలా అవుతుంది?

(38)

ప్రోక్తోపి కర్మకాండేన హ్యాత్మా దేహాద్విలక్షణమ్ ।
నిత్యశ్చ తత్ఫలం భుక్తే దేహ పాతాదనంతరం ॥

కర్మకాండకు చెందిన సిద్ధాంతరీత్యా కూడా ఆత్మ ఈ దేహంకంటె విలక్షణుడని, నిత్యుడని, దేహం నశించిన తరువాత కూడా ఆత్మ ఉంటూ, కర్మఫలాలను అనుభవిస్తుందని చెప్పబడింది.

(39)

లింగం చానేక సంయుక్తం చలం దృశ్యం వికారి చ ।
అవ్యాపక మసద్రూపం తత్ కథం స్యాత్ పుమాన్ ॥

సూక్ష్మ శరీరమనబడే లింగ శరీరం కూడా అనేక భాగాలతో కూడినది. చంచల స్వభావం కలది.

తెలుసుకోబడే దృశ్యము. మార్పులు చెందుతూ అనేక వికారాలతో పరిమితమైవుంది. కాబట్టి అసద్రూపము. అందుచేత అది పురుషుడు (ఆత్మ) ఎలా అవుతుంది?

(40)

ఏవం దేహద్వయాదన్య ఆత్మా పురుష ఈశ్వరః ।
సర్వాత్మా సర్వరూపశ్చ సర్వాతీతో౽హమవ్యయః ॥

ఈ విధంగా ఆత్మ స్థూల, సూక్ష్మ శరీరాల రెండింటికీ అన్యమైన వాడు. సర్వాధిష్ఠానమైన పురుషుడు. ఈశ్వరుడు. అందరిలో అన్నింటిలో, అంతటా వుండే సర్వాత్మ స్వరూపుడు. అన్ని రూపాలూ, ఆకారాలూ ఆయనవే. అయినా వాటన్నింటికీ అతీతుడై, అవ్యయుడై వుంటాడు.

(41)

ఇత్యాత్మ దేహభాగేన ప్రపంచస్యైవ సత్యతా ।
యథోక్తా తర్కశాస్త్రేణ తతః కిం పురుషార్థతా ॥

ఇలా దేహమూ, ఆత్మా భిన్నమైనవని, ఒకటి కాదని నిరూపించు కోవడం వల్ల, తర్క-శాస్త్ర రీత్యా, దేహాదులతో కూడిన ఈ దృశ్య ప్రపంచమంతా కూడా యదార్థమైనది, నిత్యమైనదని చెబితే, దాని వల్ల పరమ పురుషార్థమైన పరమాత్మ తత్వాన్ని పొందే ప్రయోజనం ఏముంటుంది?

(42)

ఇత్యాత్మదేహ భేదేన దేహాత్మత్వం నివారితం ।
ఇదానీ దేహభేదస్య హ్యసత్త్వం స్ఫుట ముచ్యతే ॥

ఈ విధంగా, ఆత్మకి, దేహానికి భేదాన్ని వివరించి చెప్పడం వల్ల, దేహమే ఆత్మ అనుకునే అజ్ఞాన భావం కలిగి ఉండడం తప్పుగా నిరూపించబడింది. ఇప్పుడు ఆ రెండింటికీ, అంటే, ఆత్మకీ దేహానికి వ్యక్తం చేయబడిన భేదమంతా అసత్యమైనదేనని స్పష్టంగా చెప్పబడుతోంది.

(43)

చైతన్యస్యైకరూపత్వాద్భేదో యుక్తో న కర్హిచిత్ ।
జీవత్వం చ మృషా జ్ఞేయం రజ్జౌ సర్పగ్రహో యథా॥

ఆత్మ చైతన్యం ఎప్పుడూ ఏకైక స్వరూపమే. సర్వస్వమూ అదే అయి వుంది కనుక, దానిలో ఏ కాలంలోనూ భేద భావాలకు తావు లేదు. జీవుడి వ్యక్తిత్వం కూడా అసత్యమైన భ్రాంతిభావమే. ఈ భేదత్వమంతా తాడును చూసి పామనుకొని భ్రమించడం వంటిదని గ్రహించుకోవాలి.

(44)

రజ్జ్వజ్ఞానాత్ క్షణేనైవ యద్వద్రజ్జుర్హి సర్పిణీ ।
భాతితద్వచ్చితి స్సాక్షా ద్విశ్వాకారేణ కేవలా ॥

నిజంగా ఇది తాడే అనే యదార్థ జ్ఞానం లేక పోవడం వల్ల, ఆ క్షణంలో ఆ తాడు ఏ విధంగా పాముగా తోస్తోందో, అలాగే శుద్ధ చైతన్య స్వరూపమైన ఆత్మను ఎంత మాత్రం తెలియక పోవడం వల్ల, అది ఏ మార్పూ చెందకుండానే దృశ్య ప్రపంచాకారంగా భాసిస్తోంది.

(45)

ఉపాదానం ప్రపంచస్య బ్రహ్మణోఽన్యన్న విద్యతే ।
తస్మాత్సర్వ ప్రపంచోఽయం బ్రహ్మైవాస్తి న చేతరమ్ ॥

ఈ అద్భుతమైన దృశ్యజగత్తుకంతటికీ బ్రహ్మం తప్ప ఇతరమైన కారణమేదీ ఎక్కడా లేదు. అందుచేత ఈ సమస్త ప్రపంచమూ బ్రహ్మమే కాని మరేదీ కాదు.

(46)

వ్యాప్యవ్యాపకతా మిథ్యా సర్వమాత్మేతి శాసనాత్ ।
ఇతి జ్ఞాతే పరేతత్త్వే భేదస్యావసరః కుతః ॥

ఈ విధంగా సర్వమూ బ్రహ్మస్వరూపమేనని, బ్రహ్మం తప్ప మరేదీ లేదని శ్రుతులు నిర్ధారణ చేసి చెబుతూంటే, వ్యాప్యత్వము, వ్యాపకత్వము అనేవి మిథ్యాలోచనలే అవుతాయి. ఈ పరతత్వం గ్రహించ కలుగుతే, ఇక భేదభావానికి అవకాశమెక్కడుంటుంది?

(47)

శ్రుత్యా నివారితం నూనం నానాత్వం స్వముఖేన హి ।
కథం భాసో భవేదన్యః స్థితే చాద్వయకారణే ॥

బ్రహ్మంలో అనేకత్వం లేదని స్పష్టంగా శ్రుతి తన ముఖస్తంగానే సూటిగా చెబుతోంది. ఇలా శాస్త్ర

రీత్యా బ్రహ్మం అద్వితీయమని నిస్సందేహంగా నిర్ణయింపబడి వుండగా, దానికి విరుద్ధంగా ఈ దృశ్య జగత్తు బ్రహ్మానికి అన్యంగా వేరే ఎలా ఉండగలదు? సత్యస్వరూపమైన బ్రహ్మ మొక్కటే ఉంటున్నదని ఈదృశ్య గోచర ప్రపంచమంతా వట్టి మిథ్యా స్వరూపమని భావం.

(48)

దోషోపి విహితః శ్రుత్యా మృత్యోర్మృత్యుం సగచ్ఛతి।
ఇహ పశ్యతి నానాత్వం మాయయా వంచితో నరః ॥

ఇదీకాక, మాయాప్రభావంవల్ల వంచితుడైన మానవుడు, అద్వయము, ఏకైక స్వరూపము అయి వున్న బ్రహ్మంలో అనేకత్వాన్ని చూస్తూ మళ్ళీ, మళ్ళీ జనన మరణాలతో కూడిన సంసార భ్రాంతిలో చిక్కుకుంటున్నాడనే దోషాన్ని కూడా శ్రుతి నిందా పూర్వకంగా చెబుతోంది.

(49)

బ్రహ్మణః సర్వభూతాని జాయతే పరమాత్మనః।
తస్మాత్ ఎతాని బ్రహ్మైవ భవంతీ త్యవధారయేత్ ॥

పరమాత్మ స్వరూపమైన బ్రహ్మం నుంచే సమస్తచరాచర భూతాలూ ఉద్భవిస్తున్నాయి. కనుక, అన్నీ తప్పక ఆ బ్రహ్మస్వరూపమే అవుతాయని అవగాహన చేసుకుని, నిర్ధారణ చేసుకోవాలి.

(50)

బ్రహ్మైవ సర్వనామాని, రూపాణి, వివిధాని చ ।
కర్మాణ్యపి సమగ్రాణి విభర్తీతి శ్రుతిర్జగౌ ॥

సర్వవిధాలైన ఈ సమస్త నామరూపాలకీ, కర్మకలాపాలకీ బ్రహ్మమే మూలమై వుందని శ్రుతి సుస్పష్టంగా చెబుతోంది.

(51)

సువర్ణాజ్జాయమానస్య సువర్ణత్వం శాశ్వతం।
బ్రహ్మణో జాయమానస్య బ్రహ్మత్వం చ తథాభవేత్॥

బంగారంతో తయారైన వస్తువులన్నీ ఎలా ఎప్పుడూ బంగారమే అయివున్నట్లు, బ్రహ్మం వల్ల పుట్టిన ఈ సర్వచరాచర సృష్టిపరంపరా ఎల్లప్పుడూ బ్రహ్మమే అయి వుంది.

(52)

స్వల్ప మప్యం తరం కృత్వా జీవాత్మ పరమాత్మనోః॥
యః సంతిష్ఠతి మూఢాత్మా భయం తస్యాభిభాషితమ్॥

జీవాత్మకీ, పరమాత్మకీ అతి స్వల్పమైన భేదాన్నైనా ఏ మూఢమానవుడు అజ్ఞానంవల్ల భావిస్తున్నాడో, అటువంటివాడికి భయం ఆవహిస్తుందని కూడా చెప్పబడ్డింది.

(53)

యత్రా జ్ఞానా ద్భవే ద్వైత మిత రస్తత్ర పశ్యతి
ఆత్మత్వేన యదా సర్వం నేతర స్తత్ర చాణ్వపి॥

అజ్ఞానం వల్ల ద్వైతభావం ఎప్పుడు సంక్రమిస్తుందో, అప్పుడు తనకు భేదబుద్ధికలిగి ఇతరులు, ఇతరాలు గోచరిస్తాయి. కాని, ఎప్పుడు జ్ఞానోదయమై సర్వమూ సత్యస్వరూపమైన ఆత్మగా భాసిస్తుందో, అప్పుడు భేదభ్రాంతి నశించడంచేత తాను, ఇతరము అనే భిన్న దృష్టి ఎంతమాత్రమూ వుండదు.

(54)

యస్మిన్ సర్వాణి భూతాని హ్యాత్మత్వేన విజానతః।
నవై తస్య భవేన్మోహో నచ శోకో ద్వితీయతః॥

ఈ రీతిగా సర్వచరాచర భూతాలనూ ఆత్మస్వరూపంగా అనుభవజ్ఞానంతో ఎవడు తెలుసుకుంటున్నాడో, వాడికి, తనకి అన్యంగా ద్వితీయమైనదేదీ లేకపోవడంచేత, మోహంకాని, దుఃఖంకాని ఉండదు.

(55)

అయం ఆత్మాహి బ్రహ్మైవ సర్వాత్మకతయా స్థితః।
ఇతి నిర్ధారితః శ్రుత్యా బృహదారణ్య సంస్థయా॥

అద్వితీయమైన ఈ సర్వాత్మస్థితి ఏదైతే ఎల్లప్పుడూ ఉంటున్నదో, అదే బ్రహ్మస్వరూపమని బృహదారణ్యకోపనిషత్తు ఇత్యాది శ్రుతులు నిర్ధారణ చేసి చెబుతున్నాయి.

(56)

అనుభూతో ప్యయంలోకో వ్యవహారక్షమోపి సన్।
అసద్రూపో యథా స్వప్నః ఉత్తరక్షణ బాధితః॥

వ్యావహారికంగా. అన్ని విధాలా, ఈ ప్రపంచ విషయాలన్నీ అనుభవించబడుతున్నట్లు అనిపిస్తున్నప్పటికీ, అది మరుక్షణంలో బాధింపబడుతోంది కాబట్టి, అదంతా స్వప్నంలాంటి అసద్రూపమైన మిథ్యయే.

(57)

స్వప్నో జాగరణేఽలీకః స్వప్నేపి నహిజాగరః ।
ద్వయమేవ లయే నాస్తి లయోఽపి హ్యుభయోర్నచ ॥

మెళకువ అనబడే జాగ్రదావస్థ రాగానే స్వప్నంలోని దృశ్యజాతమంతా అదృశ్యమై అంతరిస్తుంది. అలాగే స్వప్నంలో ఈ జాగ్రదావస్థ అంతా మాయమై లేనిదే అవుతుంది. ఈ జాగ్రత్, స్వప్నావస్థలు రెండూ సుషుప్తిలో (గాఢనిద్రలో) లేవు. సుషుప్తి ఆ రెండవస్థలలో (జాగ్రత్ స్వప్నావస్థలలో) లేదు

(58)

త్రయమేవం భవేన్మిథ్యా గుణత్రయ వినిర్మితం ।
అస్యద్రష్టా గుణాతీతో నిత్యోహ్యేకః చిదాత్మకః ॥

ఈ విధంగా జాగ్రత్, స్వప్న సుషుప్త్యావస్థలు మూడూ, సత్వ రజ, స్తమో గుణాలవల్ల కల్పితమైన మిథ్యా స్వరూపాలు తప్ప సత్యమైనవికావు, కానీ, ఆ మూడు అవస్థలకూ వెనక వాటికి సాక్షీమాత్రుడై ఉంటున్న ఆత్మ గుణాతీతుడు, నిత్యుడు, ఏకైక స్వరూపుడు అయిన చైతన్యమాత్రుడు.

(59)

యద్వన్మృది ఘట భ్రాంతిం శుక్తౌ వారజ తస్థితిం ।
తద్వ ద్బ్రహ్మణి జీవత్వం వీక్ష్యమాణే న పశ్యతి ॥

ఈ మిథ్యాభావం తొలగిన తరువాత మట్టితో తయారై (మట్టే) అయివున్న దానిని కుండగాను, ముత్యపుచిప్ప అయివున్న దానిని వెండిగాను అనుకుంటూ ఎలా భ్రమ చెందడో. అలాగే ఏకైక సర్వ స్వరూపుడైన బ్రహ్మంలో పరిచ్ఛిన్నమైతోచే జీవ భ్రాంతి వదలినవాడై, సమస్తమూ చైతన్య స్వరూప మైన బ్రహ్మమేనని. ఆ బ్రహ్మం తానేఅయివున్నా దని తెలివి కలగడంవల్ల ఇక జీవబ్రహ్మ విభేదాన్ని చూడడు.

(60)

యథా మృది ఘటోనామ కనకే కుండలాభి ధా ।
శుక్తౌహి రజత ఖ్యాతిః జీవ శబ్దః తథాపరే ॥

ఎలా మట్టితో తయారుచేయబడి మట్టే అయివున్న దానిని కుండ అనే పేరుతోను బంగారంతో తయారై బంగారమే అయివున్న దానిని కుండలమనే పేరుతోను, ముత్యపుచిప్పను చూసి భ్రమవలన దానిని వెండి అనే భావంతోను వ్యవహరిస్తున్నారో ఆ విధంగానే యదార్థంగా బ్రహ్మయే అయివున్న దానిని, జీవుడు అనే భ్రాంతిభావంతో వ్యవహరిస్తున్నారు,

(61)

యథైవ వ్యోమ్ని నీలత్వం యథానీరం మరుస్థలే ।
పురుషత్వం యథా స్థాణౌ తద్వ ద్విశ్వం చిదాత్మని ॥

శూన్యమైన ఆకాశం నీలవర్ణం కలిగి ఉన్నదని, ఎండమావిని నీరని, చెట్టుమోడును మనిషి అని ఎలా భ్రాంతిచే అపోహపడుతున్నారో అలాగే అజ్ఞాన

దోషంవల్ల అనంతమైన చిదాత్మ స్వరూపంలో ఈ దృశ్య జగత్తు ఉన్నట్లు భ్రమించిపోతున్నారు. అంటే నిజంగా ఈ ప్రపంచం భ్రమ కల్పితమే కాని యదార్థం కాదని తెలియచెప్పడం.

(62)

యథైవ శూన్యే వేతాళో గంధర్వాణాం పురం యథా ।
యథాకాశే ద్విచంద్రత్వం తద్వత్ సత్యే జగత్ స్థితిః ॥

భ్రమ చేత శూన్యప్రదేశంలో భూతమున్నట్లు, శూన్యమైన ఆకాశంలో గంధర్వ పుర మున్నట్లు, రెండు చంద్రులు ఆకాశంలో ఉన్నట్లు, ఎలా అపోహ పడతారో, ఆ విధంగానే అజ్ఞానం వల్ల బ్రహ్మంలో ఈ కల్పిత దృశ్య జగత్తు ఉన్నట్లు భ్రమించి పోతున్నారు.

(63)

యథా తరంగ కల్లోలై ర్జలమేవ స్ఫురత్యలమ్ ।
పాత్ర రూపేణ తామ్రం హి బ్రహ్మాండౌఘైస్తథాఽత్మతా ॥

నీటిలో చెలరేగే కెరటాలు, సుడిగుండాలు మొదలైన కల్లోలాలతో గోచరించేదంతా నీరేకాని వేరేదీకానట్లు, వివిధ పాత్రల రూపంతో కనబడేదంతా రాగేతప్ప ఇతరమేమీ అయివుండనట్లు, ఈ ఇంద్రియ గోచర బ్రహ్మాండమంతా ఆత్మస్వరూపమేకాని ఆత్మేతరమేదీకాదు.

(64)

ఘట నాత్మ యథా పృథ్వీ పటనాత్మా హి తంతవః ।
జగన్నామ్నా చిదాభాతి జ్ఞేయంతత్తద భావతః ॥

మట్టే కుండ అనేపేరుతో ఏ విధంగా గోచరిస్తోందో, నూలుపోగులే వస్త్రం అనేపేరుతో ఎలా వ్యవహరింప బడుతున్నాయో, ఆ ప్రకారంగానే సత్ చిదానందమయమైన ఆత్మస్వరూపమే జగత్తుగా నామరూపాలతో భాసిస్తోంది. ఆ నామరూపాలను వివేక, తత్వవిచారణ సాధనలతో తొలగించుకుని ఆత్మపదార్థాన్ని అనుభూతి పొందాలి.

(65)

సర్వోఽపి వ్యవహారస్తు బ్రహ్మణా క్రియతేజనైః ।
అజ్ఞానాత్ న విజానంతి మృదేవహి ఘటాదికమ్ ॥

కుండలు, మొదలైన మృణ్మయ వస్తువులన్నీ మట్టేకాని వేరేదీకాదని అజ్ఞానంవల్ల ఎలా తెలియలేక పోతున్నారో, అలాగే మనుష్యులు సమస్త కార్య కలాపాలూ బ్రహ్మంలోనే బ్రహ్మమువల్లనే చేస్తున్న ప్పటికీ అజ్ఞానకారణంవలన, దానిని తెలుసుకోలేక పోతున్నారు.

(66)

కార్యకారణ తయానిత్యం ఆస్తే ఘట మృదోః యథా ॥
తథైవ శ్రుతి యుక్తిభ్యాం ప్రపంచ బ్రహ్మణోరిహ ॥

కుండ తయారు చెయ్యడానికి మట్టికారణం కాబట్టి, కుండకీ, మట్టికి ఎల్లప్పుడూ కార్య కారణ సంబంధం ఎలా ఉన్నదో, అలాగే ఈ దృశ్య ప్రపం చానికీ, బ్రహ్మనికి అటువంటి సంబంధమే వున్నది. ఈ విషయాన్ని శ్రుతి, యుక్తుల ఆధారంగా నిశ్చ యించడం జరిగింది.

(67)

గృహ్యమాణే ఘటే యద్వత్ మృత్తికా యాతి వైబలాత్।
వీక్ష్యమాణే ప్రపంచేపి బ్రహ్మైవాభాతి భాసరమ్॥

ఘటాన్ని గురించిన ఆలోచనరాగానే వెంటనే మట్టి ఏ విధంగా మనస్సులోకి వస్తుందో, అలాగే ఈ నానాకారదృశ్య ప్రపంచాన్ని వీక్షిస్తుంటే నిత్య నిరంతర ప్రకాశమైన బ్రహ్మమే భాసిస్తుంది.

(68)

సదైవాత్మా విశుద్ధోస్మి హ్యశుద్ధో భాతి వై సదా॥
యథైవ ద్వివిధా రజ్జుః జ్ఞానినోఽ జ్ఞానినోఽనిశమ్॥

భేద దృష్టివల్ల తాడు జ్ఞానికి, అజ్ఞానికి రెండు విధాలుగా గోచరిస్తుంది. అజ్ఞానికి భ్రాంతివల్ల చీకట్లో తాడు పాములా కనిపించి, కలవర పెడుతుంది. అది తాడేకాని పాముకాదని తెలిసివున్న జ్ఞాని, చీకట్లో దానిని చూసినా ఎంతమాత్రమూ కలవర పడడు. అలాగే, జ్ఞానికి ఏకైక స్వరూపమైవున్న ఆత్మ ఎల్లప్పుడూ విశుద్ధమై గోచరిస్తుంది. కాని అజ్ఞానికి

ఇదే ఆత్మ నానావికార నామరూపాలతో అశుద్ధంగా కనబడుతుంది.

(69)

యథైవ మృణ్మయః కుంభ స్తద్వద్దేహోపి చిన్మయః
ఆత్మానాత్మ విభాగోయం ముధైవక్రియతే బుధైః॥

నామ రూపాలుగల కుండ అంతా ఎలా మట్టి మయమో, అలాగే నామరూపాత్మకమైన ఈ దేహ మంతా ఆత్మచైతన్యమే. ఆధ్యాత్మికులు, ఇంకా ద్వైత భావంతోకూడిన అజ్ఞానంలోనే వుండడంవల్ల, ఆత్మానాత్మ విభాగాన్ని అనవసరంగా చేస్తున్నారు. అంతిమలక్ష్యమైన అద్వైతజ్ఞానం ఉదయించడంతోనే ఈ విభేదదృష్టి అంతమై "సర్వం బ్రహ్మమయం జగత్" అనే అభేద దృష్టి కలుగుతుంది.

(70)

సర్పత్వేన యథారజ్జుః రజతత్వేన శుక్తికా।
వినిర్ణీతా విమూఢేన దేహత్వేన తథాత్మనా॥

తాడునుచూసి పామనుకొని, ముత్తెపుచిప్పను గాంచి వెండి అనుకొని, ఎలా మూఢుడైనవాడు అపోహపడుతున్నాడో, అలాగే అజ్ఞానంతోవున్న మూఢమానవుడు ఆత్మస్వరూపమైవున్న తనను తన శరీరంగా అన్వయించుకుని దేహాత్మబుద్ధితో ఉంటున్నాడు.

(71)

ఘటత్వేన యథా పృథ్వీ పటత్వేనైవ తంతవః।
వినిర్ణీతా విమూఢేన దేహత్వేన తథాత్మనా॥

మూఢుడు మట్టిని కుండగాను, నూలుపోగులను వస్త్రంగాను ఏ విధంగా అనుకుంటున్నాడో, అలాగే అజ్ఞానంలోవున్న మూఢమానవుడు ఆత్మస్వరూపమైవున్న తనను, తన శరీరంగా అన్వయించుకుని దేహాత్మబుద్ధితో ఉంటున్నాడు.

(72)

కనకం కుండలత్వేన తరంగత్వేన వై జలమ్।
వినిర్ణీతం విమూఢేన దేహత్వేన తథాత్మతా॥

మూఢుడు బంగారాన్ని కుండలంగాను, నీటిని కెరటంగాను ఏవిధంగా అనుకుంటున్నాడో, అలాగే అజ్ఞానంలోవున్న మూఢమానవుడు ఆత్మస్వరూపమై ఉన్న తనను తన శరీరంగా అన్వయించుకుని దేహాత్మభావంతో ఉంటున్నాడు.

(73)

పురుషత్వేన వై స్థాణు ర్జలత్వేన మరీచికా।
వినిర్ణీతా విమూఢేన దేహాత్వేన తథాత్మతా॥

చీకటిలో కొమ్మలులేని చెట్టుయొక్క మ్రానును (మోడు)చూసి మనిషిగాను, ఎండమావిని చూసి జలముగాను ఏవిధంగా భ్రమవల్ల అనుకుంటున్నాడో, అలాగే అజ్ఞానంచేత మూఢమానవుడు ఆత్మ స్వరూపమైవున్న తనను తన శరీరంగా అన్వయించుకుని, దేహాత్మభావంతో ఉంటున్నాడు.

(74)

గృహత్వేనైవ కాష్ఠాని ఖడ్గత్వేనైవ లోహతా।
వినిర్ణీతా విమూఢేన దేహాత్వేన తథాత్మతా॥

కఱ్ఱల సమూహాన్ని (కఱ్ఱలతో కట్టబడిన దానిని) గృహంగాను, లోహాన్ని (ఇనుము మొదలైన లోహాలతో తయారు కాబడినదానిని) ఖడ్గంగాను ఏవిధంగా అనుకుంటున్నాడో, అలాగే అజ్ఞానంలో వున్న మూఢమానవుడు, ఆత్మస్వరూపుడైనట్టి తనను శరీరంగా అన్వయించుకుని దేహాత్మబుద్ధితో ఉంటున్నాడు.

(75)

యథా వృక్ష విపర్యాసో జలాత్ భవతి కస్యచిత్
తద్వత్ ఆత్మని దేహాత్వం పశ్యత్య జ్ఞానయోగతః॥

నీటిలో ప్రతిబింబించిన వృక్షాన్ని చూసి, ఆ వృక్షం తల్లక్రిందులుగా వుందని ఎలా భావిస్తున్నాడో, అలాగే అజ్ఞానంవల్ల ఆత్మను దేహమనుకుని అపోహపడి పోతున్నాడు.

(76)

పోతేనగచ్ఛతః పుంసః సర్వం భాతీవ చంచలమ్
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞాన యోగతః॥

పడవలో ప్రయాణించేసే వాడికి. తాను కదలకపోయినా చుట్టుప్రక్కల అన్నీ కదిలిపోతున్నట్లు ఏ విధంగా కనపడతాయో, ఆ విధంగానే, అజ్ఞానం వల్ల ఆత్మని దేహమనుకుని భ్రమపడిపోతున్నాడు.

(77)

పీతత్వం హి యథా శుభ్రే దోషాద్భవతి కశ్యచిత్।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞానయోగతః॥

పచ్చకామెర్లరోగం సంక్రమించినవాడికి తెల్లని వస్తువులు పసుపుపచ్చగా కనపడునట్లు. అజ్ఞాన దోషంవల్ల ఆత్మస్వరూపాన్ని దేహమనుకుని భ్రమ పడి పోతున్నాడు.

(78)

చక్షుర్భ్యాం భ్రమశీలాభ్యాం సర్వంభాతి భ్రమాత్మకం।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞానయోగతః॥

కంటిదోషంవల్ల కళ్ళు తిరుగుతున్న వాడికి చుట్టుప్రక్కల అంతాకూడా తిరిగిపోతున్నట్లే కన

(83)

యద్వదగ్నౌ మణిత్వంహి మణౌ వా వహ్నితౌ పుమాన్ ।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞాన దోషతః ॥

మణిలో అగ్ని ఉన్నట్లు, అగ్నిలో మణి ఉన్నట్లు భ్రాంతి చేత ఎలా అపోహ పడుతున్నారో, ఆదే విధంగా, అజ్ఞానం వల్ల ఆత్మస్వరూపాన్ని దేహ మనుకుని భ్రమ జెందుతున్నారు.

(84)

అభ్రేషు సత్సుధావత్సు సోమో ధావతి భాతివై ।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞాన యోగతః ॥

ఆకాశంలో మేఘాలు కదిలిపోతూంటే, చంద్రుడు కదిలిపోతున్నట్లు ఏ విధంగా కనిపిస్తోందో అలాగే అజ్ఞాన ప్రభావం వల్ల, ఆత్మ స్వరూపం దేహ మనుకునే అపోహ కలుగుతోంది.

(85)

యథైవ దిగ్విపర్యాసో మోహాద్భవతి కస్యచిత్ ।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞాన మోగతః ॥

(81)

సూక్ష్మత్వే సర్వ భావానాం స్థూలత్వం చోపనేత్రతః।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞానయోగతః॥

భూతద్దాలు పెట్టుకున్న కళ్ళతో చూస్తే చిన్న చిన్న వస్తువులు ఏ విధంగా ఎంతెంతో పెద్దవిగా కనిపిస్తాయో, ఆ విధంగా అజ్ఞానం చేత ఆత్మస్వరూపాన్ని దేహమనుకుని అపోహ పడుతున్నారు.

(82)

కాచ భూమౌ జలత్వం వా జలభూమౌ హి కాచతా
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞాన యోగతః ॥

సూర్యకిరణాల వల్ల, గాజుతో పరచబడిన నేలను చూసి అది నీరు గాను, అదేవిధంగా, జలంతో వున్న భూమిని చూసి అది గాజుగాను అపోహ పడినట్లు, అజ్ఞానం వల్ల, ఆత్మ స్వరూపాన్ని దేహమనుకుని భ్రమ పడుతున్నారు.

(83)

యద్వదగ్నౌ మణిత్వంహి మణౌవా వహ్నితా పుమాన్
తద్వదాత్మని దేహత్వం పశ్యత్యజ్ఞాన దోషతః ॥

మణిలో అగ్ని ఉన్నట్లు, అగ్నిలో మణి ఉన్నట్లు భ్రాంతి చేత ఎలా అపోహ పడుతున్నారో, ఆదే విధంగా, అజ్ఞానం వల్ల ఆత్మస్వరూపాన్ని దేహ మనుకుని భ్రమ జెందుతున్నారు.

(84)

అభ్రేషు సత్సుధావత్సు సోమో ధావతి భాతివై ।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్య జ్ఞాన యో...తః ॥

ఆకాశంలో మేఘాలు కదిలిపోతూంటే చంద్రుడు కదిలిపోతున్నట్లు ఏ విధంగా కనిపిస్తోందో అలాగే అజ్ఞాన ప్రభావం వల్ల, ఆత్మ స్వరూపం దేహ మనుకునే అపోహ కలుగుతోంది.

(85)

యథైవ దిగ్విపర్యాసో మోహాద్భవతి కస్యచిత్ ।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్య జ్ఞాన మో...తః ॥

(81)

సూక్ష్మత్వే సర్వ భావానాం స్థూలత్వం చోపనేత్రతః।
తద్వదాత్మని దేహత్వం పశ్యత్య జ్ఞానయోగతః॥

భూతద్దాలు పెట్టుకున్న కళ్ళతో చూస్తే చిన్న చిన్న వస్తువులు ఏ విధంగా ఎంతెంతో పెద్దవిగా కనిపిస్తాయో, ఆ విధంగా అజ్ఞానం చేత ఆత్మస్వరూపాన్ని దేహమనుకుని అపోహ పడుతున్నారు.

(82)

కా చ భూమౌ జలత్వం వా జలభూమౌ హి కాచతా
తద్వదాత్మని దేహత్వం పశ్యత్య జ్ఞాన యోగతః ॥

సూర్యకిరణాల వల్ల, గాజుతో పరచబడిన నేలను చూసి అది నీరు గాను, అదేవిధంగా, జలంతో వున్న భూమిని చూసి అది గాజుగాను అపోహ పడినట్లు, అజ్ఞానం వల్ల, ఆత్మ స్వరూపాన్ని దేహమనుకుని భ్రమ పడుతున్నారు.

ప్రారబ్ధ కర్మ నిలవదు. మెలకువ వచ్చిన వెంటనే స్వప్నము ఉండనట్లు, జ్ఞానోదయమైన తోడనే శరీర ప్రపంచాదుల భ్రాంతి పూర్తిగా తొలగిపోతుంది. శరీరాదులే లేనప్పుడు, ఇక ప్రారబ్ధ కర్మానికి తావెక్కడ?

(92)

కర్మ జన్మాంతరీయం యత్ ప్రారబ్ధమితి కీర్తితమ్ ।
తత్తు జన్మాంతరాభావాత్ పుంసో నైవాస్తి కర్హిచిత్ ॥

కిందటి జన్మలో చెయ్యబడిన కర్మాన్ని ప్రారబ్ధమని అంటారు. ఆ కర్మ పరిణామమే ఇప్పటి జీవితం. జ్ఞాని అహంకార రహితుడు, జన్మమే లేనివాడు కనుక, ఆయనకు ప్రారబ్ధమనేది ఎంత మాత్రమూ సంభవింపదు.

(93)

స్వప్నదేహో యథాధ్యస్తస్తథైవాయం హి దేహకః ।
అధ్యస్తస్య కుతో జన్మ జన్మాభావే హి తత్ కుతః ॥

నీ కాలాన్ని ఎల్లప్పుడూ నిరంతరం, నిరంతరాయంగా ఆత్మ విచారణలోనే గడుపు. ప్రారబ్ధకర్మల వల్ల సంభవించే ఫలితాల్ని అనుభవిస్తూ, దానివల్ల ఎటువంటి ఉద్వేగాన్నీ పొందకు.

(90)

ఉత్పన్నే ప్యాత్మ విజ్ఞానే ప్రారబ్ధం నైవ ముంచతి ।
ఇతియన్ శ్రూ యతే శాస్త్రాత్ తత్ నిరాక్రియతే ధునా ॥

ఆత్మజ్ఞానం ఉత్పన్నమైన తరువాత కూడా ప్రారబ్ధకర్మల ప్రభావం విడువదని వేదాంతశాస్త్రాలలో వినబడే సిద్ధాంతం ఇప్పుడు తిరస్కరింపబడుతోంది.

(91)

తత్వ జ్ఞానోదయా దూర్ధ్వం ప్రారబ్ధం నైవ విద్యతే ।
దేహాదీనా మసత్వాత్తు యథా స్వప్నో విబోధత ॥

దేహమే తాను అనుకునే దేహాత్మ భ్రాంతి తొలగిపోయి. తత్వజ్ఞానోదయం కలిగిన పిమ్మట,

ప్రారబ్ధ కర్మ నిలవదు. మెలకువ వచ్చిన వెంటనే స్వప్నము ఉండనట్లు, జ్ఞానోదయమైన తోడనే శరీర ప్రపంచాదుల భ్రాంతి పూర్తిగా తొలగిపోతుంది. శరీరాదులే లేనప్పుడు, ఇక ప్రారబ్ధ కర్మానికి తావెక్కడ?

(92)

కర్మ జన్మాంతరీయం యత్ ప్రారబ్ధమితి కీర్తితమ్ ।
తత్తు జన్మాంతరాభావాత్ పుంసో నైవాస్తి కర్హిచిత్ ॥

కిందటి జన్మలో చెయ్యబడిన కర్మాన్ని ప్రారబ్ధమని అంటారు. ఆ కర్మ పరిణామమే ఇప్పటి జీవితం. జ్ఞాని అహంకార రహితుడు, జన్మమే లేనివాడు కనుక, ఆయనకు ప్రారబ్ధమనేది ఎంత మాత్రమూ సంభవించదు.

(93)

స్వప్నదేహో యథాధ్యస్త స్తథైవాయం హిదేహకః ।
అధ్యస్తస్య కుతో జన్మ జన్మాభావే హి తత్ కుతః ॥

నీ కాలాన్ని ఎల్లప్పుడూ నిరంతరం, నిరంతరాయంగా ఆత్మ విచారణలోనే గడుపు. ప్రారబ్ధకర్మల వల్ల సంభవించే ఫలితాల్ని అనుభవిస్తూ, దానివల్ల ఎటు వంటి ఉద్వేగాన్నీ పొందకు.

(90)

ఉత్పన్నే ప్యాత్మ విజ్ఞానే ప్రారబ్ధం నైవ ముంచతి ।
ఇతియన్ శ్రూయతే శాస్త్రాత్ తత్ నిరాక్రియతే ధునా ॥

ఆత్మజ్ఞానం ఉత్పన్నమైన తరువాత కూడా ప్రారబ్ధకర్మల ప్రభావం విడువదని వేదాంతశాస్త్రాలలో వినబడే సిద్ధాంతం ఇప్పుడు తిరస్కరింపబడుతోంది.

(91)

తత్వ జ్ఞానోదయా దూర్ధ్వం ప్రారబ్ధం నైవ విద్యతే ।
దేహాదీనా మసత్వాత్తు యథా స్వప్నో విబోధత ॥

దేహమేతాను అనుకునే దేహాత్మ భ్రాంతి తొలగిపోయి, తత్వజ్ఞానోదయం కలిగిన పిమ్మట,

భ్రాంతివల్ల, అది తాడు అనే యదార్థ పరిజ్ఞానాన్ని విడిచిపెట్టి, దాన్ని పామనుకుని ఏ విధంగా అపోహపడుతున్నాడో, అలాగే మూఢుడైన అజ్ఞాని సత్యస్వరూపమైన పరమార్థాన్ని తెలుసుకోలేక, మిథ్యాస్వరూపమైన ప్రపంచాన్ని చూస్తున్నాడు.

(96)

రజ్జురూపే పరిజ్ఞాతే సర్పఖండం నతిష్ఠతి
అధిష్ఠానే తథాజ్ఞాతే ప్రపంచ శ్శూన్యతాం గతః ॥

ఇది తాడేనన్న పరిజ్ఞానం కలిగిన పిమ్మట ఇక సర్పరూప భ్రాంతి ఎంత మాత్రమూ వుండదు. అలాగే అధిష్ఠాన పరమాత్మ స్వరూపం అనుభూతి చెందిన వెంటనే దృశ్య ప్రపంచమంతా తనలోనే లయించి సూన్యమే అవుతుంది.

(97)

దేహస్యాపి ప్రపంచత్వాత్ ప్రారబ్ధావ స్థితిః కుతః ।
అజ్ఞాని జనబోధార్థం ప్రారబ్ధం వక్తివై శ్రుతిః ॥

దేహంకూడా మిథ్యాస్వరూపమైన ప్రపంచం లోనిదే కాబట్టి, దేహానికి సంబంధించిన ప్రారబ్ధం ఇక ఎలా వుండగలదు? అజ్ఞానులైన జనులకు తత్వాన్ని బోధించడంకోసం శ్రుతి ప్రారబ్ధాన్ని గురించి చెబుతోంది.

(98)

క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ।
బహుత్వం తన్నిషేధార్థం శ్రుత్యా గీతం చ యత్ స్ఫుటమ్॥

"కార్య కారణాలతో వున్న అన్ని ద్వంద్వాలలోనూ గోచరించే ఆ పరమాత్మను సాక్షాత్కరించుకున్న మీదట అన్ని కర్మలూ క్షయించి పోతాయి." అన్న శ్రుతి (ముండకోపనిషత్తు), అజ్ఞానియొక్క బోధకోసం చెప్పబడిన ప్రారబ్ధాన్ని కూడా నిషేధించడానికి "కర్మాణి" అని బహు వచనం ఉపయోగిస్తూ స్పష్టంగా విశదపరచింది.

(99)

ఉచ్యతే జ్ఞైర్బలా చ్చైతత్ తదానర్థ ద్వయాగమః ।
వేదాంత మతహానంచ యతోజ్ఞానం ఇతి శ్రుతిః ॥

శ్రుతి ఇలా స్పష్టం చేసినప్పటికీ, అజ్ఞానులు ఈ ప్రారబ్ధం అనేది బ్రహ్మజ్ఞానం పొందిన మహనీయుడికూడా తప్పదని పట్టుదలతో వాదిస్తే, వాళ్ళు, పునర్జన్మ, మోక్షం అనేది లేక పోవడం అనే రెండు అనార్థాల్ని ఎదుర్కోవలసి వస్తుంది, అటు వంటిది, యదార్థమైన వేదాంత సిద్ధాంతానికి అద్వైతానికి విరుద్ధమైన పరిస్థితి. అందుచేత శ్రుతులలో ప్రతిపాదింప బడినట్లు, జ్ఞాన స్వరూపమైన బ్రహ్మం ఒక్కటే పరమార్థ సత్యమని గ్రహించుకోవాలి.

(100)

త్రిపంచాగాన్యథో వక్ష్యే పూర్వోక్త స్యహిలబ్ధయే ।
తైశ్చ సర్వై సదా కార్యం నిదిధ్యాస సమేవతు ॥

పైన చెప్పబడిన ఆత్మజ్ఞానం పూర్ణంగా సిద్ధించ డానికి, పదిహేను అంశాలతో కూడిన సాధనా క్రమాన్ని చెబుతాను. ఆ పదిహేను అంశాల్ని అభ్యాసంచేస్తూ, ఎల్లప్పుడూ నిదిధ్యాస అనే ఆత్మ తత్వవిచారణలో నిమగ్నుడవై ధ్యానం చేసుకోవాలి.

(101)

నిత్యాభ్యాసాదృతే ప్రాప్తిః నభవేత్స చ్చిదాత్మన ః।
తస్మా ద్బ్రహ్మ నిదిధ్యాసేత్' జిజ్ఞాసు శ్శ్రేయసే చిరమ్॥

నిత్యమూ, నిరంతరాయంగా అభ్యాసం చెయ్యకపోతే, సచ్చిదానంద స్వరూపమైన పరమాత్మ సిద్ధించదు. అందుచేత, జిజ్ఞాసుడైన సాధకుడు తన ఆధ్యాత్మిక శ్రేయస్సు కోసం, సాధనలో శీఘ్ర ప్రగతిని సాధించిడానికి చిరకాలం విడువకుండా నిదిధ్యాస (ఆత్మతత్వ విచారం) చేసుకోవాలి.

(102) (103)

యమోహి నియమస్త్యాగో మౌనం దేశశ్చ కాలతా।
ఆసనం మూలబంధశ్చ దేహసామ్యం చ దృక్ స్థితి ః॥

ప్రాణ సంయమనం చైవ ప్రత్యాహారశ్చ ధారణా ।
ఆత్మధ్యానం సమాధిశ్చ ప్రోక్తాన్య జ్గాని వైక్రమాత్॥

ఆ పదిహేను అంశాలు క్రమంగా ఈ విధంగా ఉంటాయని చెప్పబడింది:— యమం, నియమం, త్యాగం, మౌనం, దేశం, కాలం, ఆసనం, మూల బంధం, దేహసామ్యం, దృష్టినిలకడ, ప్రాణసం యమనం, ప్రత్యాహారం, ధారణ, ఆత్మధ్యానం, సమాధి.

(104)

సర్వం బ్రహ్మేతి విజ్ఞానా దింద్రియ గ్రామ సం యమః
యమోఽయమతి సంప్రోక్తోభ్యసనీయో ముహుర్ముహు ॥

సర్వం బ్రహ్మమయం, బ్రహ్మం కానిది ఏదీ లేదు అనే విజ్ఞానం కలగడంతో, ఇంద్రియాల నన్నింటినీ విషయాలనుండి నిగ్రహించి, మనస్సు నిర్మలంగా ఉంచుకోవడం ఏదో అదే యమము. దానిని మాటి మాటికీ అభ్యాసం చేసుకోవాలి.

(105)

సజాతీయ ప్రవాహశ్చ విజాతీయ తిరస్కృతిః।
నియమోహి పరానందో నియమాత్ క్రియతే బుధైః॥

స్వస్వరూపమే అయివున్న బ్రహ్మాకారధ్యాన ప్రవహాన్ని నిరంతరము, నిరంతరాయంగా సాగిస్తూ, తదితర వృత్తులకి సంబంధించిన ఆలోచన లన్నింటినీ తిరస్కరిస్తూ. చేయ్యబడే సాధనే నియమము. ఇదే సర్వోత్కృష్టమైన పరమానందాన్ని ప్రసాదించేది. వివేకవంతులైన ఉత్తమ ఆధ్యాత్మిక సాధకులు నిత్యమూ అభ్యసిస్తూ ఆచరించేది.

(106)

త్యాగః ప్రపంచ రూపస్య చిదాత్మత్వావ లోకనాత్ ।
త్యాగోహి మహతాం పూజ్యః సద్యో మోక్షమయో యతః॥

నామ రూపాలతో గోచరించే దృశ్య జగత్తంతా, స్వశరీరంతో సహా వట్టి మిథ్యాస్వరూపమని, ఉన్నది సచ్చిదానంద చైతన్య స్వరూపమొక్కటేనని తెలుసుకోడంవల్ల, ఆ దృశ్య ప్రపంచాన్ని

అలక్ష్యం చేస్తూ, దానిపట్ల ఔదాసీన్యంతో వుండడం ఏదో, అదే యదార్థమైన త్యాగం. ఇలాంటి త్యాగం శీఘ్రంగా మోక్షపథమై పరిణమిస్తుంది కాబట్టి, ఉత్తమ జిజ్ఞాసులు దాన్ని ఎంతో గొప్పదిగా పరిగణిస్తూ, అభ్యసిస్తారు.

(107)

యస్మాద్వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ ।
యన్మౌనం యోగిభిర్గమ్యం తద్భవేత్ సర్వదా బుధః॥

మాటలు మనస్సుతో కూడ పొందజాలక దేనినుండి వెనక్కి మళ్ళి తిరిగి వస్తున్నాయో, దేనిని గురించి వాక్కు చెప్పడానికి మనస్సు ఊహించడానికీ అసాధ్యమైవుందో, అయితే ఆత్మ జ్ఞానులకు అవగాహన అవుతుందో అది మౌనమని చెప్పబడుతోంది.

(108) (109)

వాచో యస్మాన్నివర్తంతే తద్వక్తుం కేన శక్యతే ।
ప్రపంచో యది వక్తవ్యః సోపి శబ్ద వివర్జిత ః॥

ఇతి వా తద్భవేన్మౌనం సతాం సహజ సంజ్ఞితమ్ ॥
గిరా మౌనం తు బాలానాం ప్రయుక్తం బ్రహ్మవాదిభిః॥

దేనినుంచి మాటలు నివర్తిల్లుతున్నాయో, దాన్ని (బ్రహ్మన్ని)గురించి చెప్పడానికి ఎలా సాధ్యమౌతుంది? అందుచేత బ్రహ్మన్ని గురించి చెప్పడానికి మౌనమే శరణ్యం. ఇక ప్రపంచమంతా బ్రహ్మస్వరూపమే కాబట్టి, దానిని గురించి చెప్పాలన్నా మాటలకు సాధ్యం కాదు. అదికూడా అనిర్వచనీయమే. వాక్కుకు అతీతమైందే అవుతుంది. ఈ విధంగా జ్ఞానుల సహజదృష్టిలో అదికూడా మౌనమే. వాంఙ్నిరోధం అనే వాచికమౌనం, మూఢజనుల కోసం నిర్దేశింప బడిందని బ్రహ్మవాదులచే చెప్ప బడుతోంది.

(110)

ఆదావంతే చ మధ్యే చ జనో యస్మిన్న విద్యతే।
యేనేదం సతతం వ్యాప్తం స దేశో విజనః స్మృత ॥

ఆదిలోను, అంతమందు, మధ్యమునా జగత్తు దేనిలో లేదో, దేనిచే అది అన్నికాలాలలోనూ,

యెల్లప్పుడూ వ్యాపించివుందో, అటువంటి ఏకాంతమైన బ్రహ్మస్వరూపం దేశమని చెప్పబడింది.

(111)

కలనాత్సర్వ భూతానాం బ్రహ్మాదీనాం నిమేషతః ।
కాల శబ్దేనా నిర్దిష్టో హ్యఖణ్డానందకోఽద్వయః ॥

నిమిషమాత్రంలో బ్రహ్మమొదలు సకల భూతాల యొక్క సృష్టి స్థితి, లయాలనూ జరిపించే, అద్వితీయ, అఖండానందమయుడైన బ్రహ్మమే కాలమని చెప్పబడుతోంది.

(112)

సుఖేనైవ భవేద్యస్మిన్నజస్రం బ్రహ్మ చింతనమ్।
ఆసనం తద్విజానీయాన్నేతర త్సుఖ నాశనమ్॥

ఎక్కడైతే, ఎల్లప్పుడూ సులువుగా, సుఖంగా నిరంతరాయంగా బ్రహ్మను చింతన సాగుతూంటుందో, అదే ఆసనమని గ్రహించుకోవాలి. అటువంటి సుఖకరమైన చింతనలేని ఇతర ఆసనాలు (బ్రహ్మేతర భావాలతో కూడినవి) ఆసనాలు అవవు.

(113)

సిద్ధం యత్ సర్వభూతాది విశ్వాధిష్ఠానమవ్యయమ్॥
యస్మిన్ సిద్ధాః సమావిష్టాస్తద్వై సిద్ధాసనం విదుః॥

సర్వభూతాలకూ ఆదియై, విశ్వానికంతటికీ ఆధారమై, నాశంలేక, నిత్యసిద్ధమై వున్న ఏ పరమాత్మ తత్వంలో సిద్ధులు పూర్ణంగా ఐక్యాన్ని పొంది వుంటారో, దానినే సిద్ధాసనమని అంటారు.

(114)

యన్మూలం సర్వభూతానాం యన్మూలం చిత్త బంధనం॥
మూలబంధః సదా సేవ్యో యోగ్యోసౌ రాజయోగినామ్

సమస్త భూతాలకూ ఏది మూలమో, మనో నిగ్రహం దేని మీద ఆధారపడివుందో, ఆ పరమాత్మ తత్వాన్నే మూలబంధమంటారు. అదే ఎల్లప్పుడూ సేవించవలసినది. రాజయోగులకు యోగ్యమైనది.

(115)

అంగానాం సమతాం విద్యాత్సమే బ్రహ్మణి లీయతే ।
నోచే న్నైవ సమానత్వం ఋజుత్వం శుష్క వృక్షవత్ ॥

శరీరాంగాలన్నీ బ్రహ్మస్వరూపాలుగా భావన చేస్తూ, వాటిని బ్రహ్మంలో లీంనచెయ్యడమే సమానత్వం అవుతుందని తెలుసుకోవాలి. అలాకాక కేవలం శరీరావయవాల్ని భౌతికంగా విషయపదార్థాల అనుభవం కోసం ఉపకరించే వాటిలా పరిగణిస్తే, ఎండిపోయిన చెట్టులా ఋజుత్వం) సమానత్వం కలగదు.

(116)

దృష్టింజ్ఞానమయీం కృత్వా పశ్యేద్ బ్రహ్మమయం జగత్।
సాదృష్టిః పరమోదారా న నాసాగ్రావలోకనీ ॥

విచారసాధన (నిధిధ్యాన) ద్వారా తత్వజ్ఞాన దృష్టిని పెంపొందించుకుంటూ, సర్వజగత్తునూ పరబ్రహ్మ స్వరూపంగా అవలోకించడమే, సరియైన పరమోత్తమమైన దృష్టి. అంతేకాని, ముక్కు చివర కంటి దృష్టిని ఉంచుతూ, బలవంతంగా మనస్సు

నిలపడానికి ప్రయత్నించడం, ఉత్తమమైనజ్ఞాన యుక్త సాధన అవదు.

(117)

ద్రష్టి దర్శన, దృశ్యానాం విరామో యత్రవా భవేత్ ।
దృష్టి తత్త్రైవ కర్తవ్యా న నాసాగ్రావలోకినీ ॥

లేకపోతే, ద్రష్ట (జీవుడు), దృశ్యము (జగత్తు), దృష్టి (వృత్తి జ్ఞానం) అనే త్రిపుటిగా తోచే భేద భావాన్ని నశింపజేసే, అంతా బ్రహ్మమే, అనే లయజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే నిజమైన ఉత్తమ కర్తవ్య దృష్టి అవుతుంది. అలా కాకుండా ముక్కు కొనమీద సూటిగా చూస్తూ, బలవంతంగా నిలిపే దృష్టి ఉత్తమమైన జ్ఞానయుక్త సాధన అవదు.

(118)

చిత్తాది సర్వ భావేషు బ్రహ్మత్వేనైవ భావనాత్ ।
నిరోధః సర్వ వృత్తీనాం ప్రాణాయామః స ఉచ్యతే ॥

చిత్తానికి సంబంధించిన భావాలు, మనో వికారాదులు సర్వమూ పరబ్రహ్మ స్వరూపమేనని భావించుకొనుచూ చేసే సాధనానుష్ఠానం వల్ల సంభవించే సహజ సర్వవృత్తి నిరోధమే ప్రాణాయామమని చెప్పబడుతోంది.

(119) (120)

నిషేధనం ప్రపంచస్య రేచకాఖ్య స్సమీరణః ।
బ్రహ్మైవాస్మీతియావృత్తి పూరకోవాయు రీరితః॥

తతస్తద్వృత్తి నైశ్చల్యం కుంభకః ప్రాణసంయమః।
అయం చాపి ప్రబుద్ధానామజ్ఞానాం ఘ్రాణపీడనమ్ ॥

ప్రపంచమంతా మిథ్యా స్వరూపం తప్ప యదార్థమైంది కాదని భావిస్తూ) దాన్నితిరస్కరించడం ప్రాణాయామంలో రేచకం (వాయువును వదలడం). తాను బ్రహ్మస్వరూపమే అయివున్నాడని నిధిధ్యాసచే నిర్ధారణ చేసుకునే వృత్తి పూరకం (వాయువును పీల్చుకోడం,) తాను బ్రహ్మస్వరూపమే అనే భావంలో నిలకడ కలిగి వుండిపోవడమే కుంభకం (వాయువును నిరోధించడం.). ఈ విధ

మైన ప్రాణాయామం జ్ఞానయుక్తమైనది. కనుక, ఉత్తమ ఆధ్యాత్మిక సాధకులకు తగివుంది. ఇక ముక్కుతో గాలిని పీలుస్తూ, కుంభిస్తూ, విడుస్తూండే భౌతిక ప్రాణాయామం అజ్ఞానులకు అనుకూలిస్తుంది.

(121)

విషయే ష్వాత్మ తాం దృష్ట్వా మనసశ్చితి మజ్జనం ।
ప్రత్యాహారస్స విజ్ఞేయోభ్యసనీ యో ముముక్షుభి ః॥

ఇంద్రియ గోచర విషయాలన్నీ పరమాత్మ స్వరూపమేనని భావిస్తూ, మనస్సును సచ్చిదానంద స్వరూపమైన పరబ్రహ్మంమీద నిలుపుతూ దానిలో నిమగ్నమవడమే ప్రత్యాహారం. మోక్షాసక్తులైన ఉత్తమ ఆధ్యాత్మిక సాధకులు దీనిని అభ్యాసం చెయ్యాలి.

(122)

యత్ర యత్ర మనోయాతి బ్రహ్మ స్తత్ర దర్శనాత్ ।
మనసోధారణం చైవ ధారణా సా పరామతా ॥

ఎక్కడెక్కడ మనస్సు సంచరిస్తూంటుందో అక్కడక్కడ ఉన్నదంతా బ్రహ్మ స్వరూపంగా చూస్తూ, నిర్ధారణ చేసుకునే తత్వవిచార సాధన వల్ల మనో నిలకడ పొందడమే ఉత్తమమైన ధారణ అవుతుంది.

(123)

బ్రహ్మైవాస్మీతి సద్వృత్యా నిరాలంబతయా స్థితిః।
ధ్యాన శబ్దేన విఖ్యాతా పరమానంద దాయినీ ॥

నేనే ఏకైక స్వరూపమైన బ్రహ్మాన్ని అనే నిరంతర నిరంతరాయమైన సద్భావంతో దేహాది సమస్త దృశ్య జాత మంతటికీ విలక్షణుడై వుండిపోవడమే ధ్యానం. ఇలాంటి మహోన్నత స్థితి పరమానంద దాయకమై వుంటుంది.

(124)

నిర్వికారతయా వృత్త్యా బ్రహ్మాకారతయా పునః।
వృత్తివిస్మరణం సమ్యక్ సమాధిర్జ్ఞాన సంజ్ఞకః॥

సంకల్ప వికల్పాలన్నింటినీ పూర్తిగా విస ర్జించడం వల్ల మనస్సుని వృత్తి రహితంగా, నిర్వి కారంగా ఉంచుతూ, దానిని బ్రహ్మ స్వరూపంతో ఏకం చేస్తూ, ధ్యేయాకార వృత్తికూడా లేక, బ్రహ్మ స్వరూపమే తానై వుండడమే సమాధి. సమాధి స్థితి సమ్యక్ జ్ఞాన స్వరూపమే.

(125)

ఇమం చాకృతి మానందం తావత్ సాధు సమభ్యసేత్
వశ్యో యావత్ క్షణాత్ పుంసః ప్రయుక్తః సన్ భవేత్
స్వయమ్॥

స్వయం స్వభావ సిద్ధమైన ఈ ఆనందాను భూతిని కలుగజేసే, పదిహేను అంగాలుకల ఈ నిధిధ్యాస అనే స్వస్వరూపాను సంధానమైన సాధ నను అభ్యసిస్తూ, క్రమేణా తాను తలచిన క్షణంలో ఆ ఆనందం తనకు స్వయం స్ఫురణమై ప్రస్ఫుటంగా అనుభూతి అయేవరకూ జాగ్రత్తగా అభ్యా సిస్తుండాలి.

126

తతః సాధన నిర్ముక్తః సిద్ధో భవతి యోగిరాట్ ।
తత్ స్వరూపం న చైతస్య విషయో మనసో గిరామ్ ॥

అలా సాధన చేసి సిద్ధి పొందడం వల్ల యోగులలో అత్యంత శ్రేష్ఠుడైన యోగిరాజు, ఇక తాను చేయవలసిన సాధనలేవీ లేనివాడై సాధనా నిర్ముక్తుడౌతున్నాడు. తానే బ్రహ్మ స్వరూపుడై వుండడం వల్ల, మనస్సుకు, వాక్కుకు అవిషయుడై, ఎలాటి సాధన కర్తవ్యం లేనివాడై వుంటాడు.

(127) (128)

సమాధౌ క్రియమాణేతు విఘ్నా న్యాయాంతివై బలాత్।
అనుసంధాన రాహిత్యం ఆలస్యం భోగలాలసమ్॥
లయస్తమశ్చ విక్షేపో రసాస్వాదశ్చ శూన్యతా।
ఏవం యద్విఘ్న బాహుల్యం త్యాజ్యం బ్రహ్మవిదా శనైః॥

సమాధిస్థితి పొందడానికి సాధనాభ్యాసం చేసే సమయంలో బలాత్కారంగా అనేక అవరోధాలు,

విఘ్నాలు వస్తూంటాయి. అవేమంటే: తత్వ విచారణ తొలగిపోయి మనస్సు వేరే లౌకిక విషయాలలో తగులొన్నటం, సోమరితనం, భోగానుభవాలను గూర్చిన చింతన, నిద్ర, సాధనమీద ఉత్సాహం క్షీణించి మందబుద్ధికలగడం. ఏదిచేయ్యాలో, చెయ్యకూడదో తెలియకపోవడం, లౌకిక విషయానుభవాల మీద ఆకాంక్ష, శూన్యత్వం మొదలైనవి. బ్రహ్మజ్ఞానాన్ని సత్వరంగా పొందాలని కోరికతోవున్న ముముక్షువు ఇలాంటి అనేక రకాలైన అవరోధాల్ని, విఘ్నాల్ని నెమ్మనెమ్మదిగా తొలగించుకోవాలి.

(129)

భావ వృత్త్యాహి భావత్వం శూన్యవృత్త్యాహి శూన్యతా।
బ్రహ్మ వృత్త్యాహి పూర్ణత్వం తథా పూర్ణత్వ మభ్యసేత్॥

మనస్సు దేన్ని గురించి భావిస్తూంటుందో దాని వృత్తిలో భావలయత్వం పొందుతుంది. అలాగే దేనినీ భావించక, శూన్యవృత్తితో వుంటే, శూన్యత్వంతో

వుంటుంది. నిరంతరం బ్రహ్మనిష్ఠలో వుంటే, పూర్ణత్వం సిద్ధించి బ్రహ్మానుభూతి పొందుతుంది. కనుక, ఎల్లప్పుడూ పూర్ణత్వమనే బ్రహ్మానుభూతికోసం సక్రమ సాధనాభ్యాసం చేస్తూ వుండాలి.

(130)

యేహి వృత్తిం జహాత్యేనాం బ్రహ్మాఖ్యాం పావనీంపరామ్
వృథైవ తేతు జీవంతి పశుభిశ్చ సమా నరాః॥

అలాకాక, పావనమూ, పరమూ అయిన బ్రహ్మ భావాన్ని విడిచి, పూర్ణత్వం కోసం ఎలాంటి సాధనా చెయ్యని వాళ్ళు, వాళ్ళకి ప్రాప్తించిన, అతి దుర్లభమైన మానవజన్మని వ్యర్థం చేసుకున్న వాళ్ళై, కేవలం పశు సమానులే అవుతారు.

(131)

యేహి వృత్తిం విజానంతి జ్ఞాత్వాపి వర్ధయాంతి, యేః
తేవై సత్పురుషా ధన్యా వంద్యాస్తే భువనత్రయే॥

ఈ పరమార్థ వృత్తిని ఎవరు మొదట అవగాహన చేసుకుని, తరువాత దాన్ని క్రమ క్రమంగా వృద్ధి పొందించు కొంటున్నారో, వారే సత్పురుషులు. ధన్యాత్ములు. అటువంటి వారు మూడు లోకాలలో అందరి చేతా నమస్కరింప తగినవారు.

(132)

ఏషాం వృత్తిం సమావృద్ధా పరిపక్వా చ సా పునః।
తే వై సద్బ్రహ్మతాం ప్రాప్తా నేతరే శబ్దవాదినః॥

ఎవరియందీ పరమార్థ వృత్తి నిలకడగా, ఎప్పుడూ వుంటూ, సమంగా వృద్ధి పొందుతూ పరిపక్వ మౌతుందో అటువంటి మహానుభావులు సదా బ్రహ్మ స్వరూపులే అయి భాసిస్తారు. కాని, కేవలం మాటలు పలికే వాచా వేదాంతులు అటువంటి బ్రహ్మానుభవం పొందలేరు.

(133)

కుశలా బ్రహ్మ వార్తాయాం వృత్తి హీనాః సురాగిణః
తేఽప్యజ్ఞానతయా నూనం పునరాయాంతి యాంతి చ॥

బ్రహ్మను సంధానం చేస్తూ బ్రహ్మానుభవాన్ని పొందే సక్రమమైన సాధన చెయ్యక, కేవలం బ్రహ్మ విద్యని గురించి బాగా వివరిస్తూ నేర్పుగా ఉపన్యాసాలూ, ప్రవచనాలూ చేసే పండితులు, అజ్ఞానులే కనుక, అటువంటివారు మళ్ళీ మళ్ళీ జనన మరణాల్ని పొందుతూంటారే కాని, మోక్ష పథానికి అర్హులు అవరు.

(1■4)

నిమేషార్థం న తిష్ఠంతి వృత్తిం బ్రహ్మమయీం వినా॥
యథా తిష్ఠన్తి బ్రహ్మాద్యాః సనకాద్యాః శుకాదయః॥

బ్రహ్మను సంధాన పరులైన మహనీయులు, బ్రహ్మాది దేవతలు, సనక సనందనాదులు, శుకాదులు, మొదలైనవారిలా ఒక్క అరనిముషమేనా బ్రహ్మకార వృత్తిని విడిచి ఉండరు.

(135)

కార్యే కారణతా యాతా కారణే నహి కార్యతా।
కారణత్వం తతో గచ్ఛేత్ కార్యాభావే విచారతః॥

కార్యమందు కారణం యొక్క స్వభావం కనిపిస్తుంది. కాని, కారణమందు కార్యత్వం కనిపించదు. కాబట్టి, తత్వవిచారంవల్ల, కార్యం లేనప్పుడు, కారణం అదృశ్యమౌతుంది.

(136)

అథ శుద్ధం భవేద్వస్తు యద్వై వాచామ గోచరమ్।
ద్రష్టవ్యం మృద్ఘటేనైవ దృష్టాంతేన పునః పునః॥

పైన తెలియజేసిన ప్రకారం కారణత్వం నశించినంతనే, శుద్ధము, అవాఙ్మనస గోచరము అయిన సద్వస్తువు (బ్రహ్మము) కార్య కారణ విలక్షణమై భాసిస్తుంది. ఈ సత్యస్వరూప పర

బ్రహ్మతత్వాన్ని, మృద్ఘట దృష్టాంతాన్ని దృష్టిలో వుంచుకొని, పదే పదే దృఢంగా అవగాహన చేసుకోవాలి.

(137)

అనేనైవ ప్రకారేణ వృత్తిం బ్రహ్మాత్మికా భవేత్।
ఉదేతి శుద్ధ చిత్తానాం వృత్తి జ్ఞానం తతః పరమ్॥

ఈ ప్రకారంగా చేసే తత్వ విచార సాధన వల్ల, బ్రహ్మాను సంధానం సంప్రాప్తమయే సమర్థ వంతమైన వృత్తి కలుగుతుంది. ఇలా సాధన కొనసాగిస్తే, శుద్ధ చిత్తులైన సాధక మహాశయులకువృత్తి జ్ఞానం (బ్రహ్మానుభవ జ్ఞానం) ఉదయిస్తుంది.

(138)

కారణం వ్యతిరేకేణ పుమనాదౌ విలోకయేత్।
అన్వయేన పునః తద్ధి కార్యే నిత్యం ప్రపశ్యతి॥

ఇలాచేసే తత్వ విచార సాధనలో, ముందు కారణాల్ని వ్యతిరేక భావంతో అవగాహన చేసు

కోవాలి. తరువాత దాన్ని అన్వయ దృష్టితో గ్రహించుకోవాలి. ఇలా చెయ్యడం వల్ల ఎల్లప్పుడూ కారణం కార్యంలో అనుభూతమై వుండేదే అని తెలుసుకుంటాడు.

(139)

కార్యేహి కారణం పశ్యేత్ పశ్చాత్ కార్యం విసర్జయేత్
కారణత్వం తతో గచ్ఛే దవశిష్టం భవేన్మునిః॥

సాధకుడు ఎల్లప్పుడూ కార్యంలో కారణాన్నే చూస్తూ, దానిమీదే దృష్టిని వుంచుతూ. కార్యాన్ని పూర్తిగా విసర్జించాలి. ఇలా కార్యాన్నంతటినీ విడిచి పెడితే. కారణత్వం కూడా అదృశ్యమై ఇక శేషించి వుండే తానే బ్రహ్మస్వరూపుడై భాసిస్తాడు.

(140)

భావితం తీవ్ర వేగేన యద్వస్తు నిశ్చయాత్మనా।
పుమాన్ తద్ధి భవేత్ శీఘ్రం జ్ఞేయం భ్రమర కీటవత్॥

నిశ్చయమైన గట్టి నమ్మకం కలిగిన సాధకుడు తీవ్రతరమైన వేగంతో ఏ వస్తువును నిలకడగా భావిస్తూంటాడో, శీఘ్రకాలంలో తానే ఆ జ్ఞేయ వస్తువు అవుతాడు. భ్రమర కీటక న్యాయం దీనికి దృష్టాంతం. (భ్రమరము ఒక రకమైన కీటకాన్ని తెచ్చి తన గూటిలో ఉంచి, దాని చుట్టూ రొద చేస్తూంటే, ఆ కీటకం భయంతో నిరంతరం ఆ భ్రమరాన్నే భావిస్తూ. చివరికి అది భ్రమరంగా మారుతుంది.)

(141)

అదృశ్యం భావరూపం చ సర్వమేవ చి దా త్మకం ।
సావధానతయా నిత్యం స్వాత్మానం భావయేత్ బుధః ॥

వివేకమతులైన సాధక మహాశయులు ద్రష్ట, దృక్కు, దృశ్యము అనే మూడింటితో కూడిన ఈ గోచరాగోచర సర్వ జగత్తూ ఆత్మ స్వరూపమేనని సావధాన చిత్తంతో జాగ్రత్తగా నిత్యమూ భావించుకొనుచూ ధ్యాన నిమగ్నులై వుండాలి.

(142)

దృశ్యం హ్యదృశ్యతాం నీత్వా బ్రహ్మాకారేణ చింతయేత్।
విద్వాన్నిత్య సుఖే తిష్ఠేద్ధియా చిద్రస పూర్ణయా ॥

ఇంద్రియాలకు, మనస్సుకు గోచరించే దృశ్య ప్రపంచం యొక్క నామ రూపాదులన్నింటినీ మిథ్యాగా విస్మరిస్తూ, అదంతా ఆకార సూన్యమైన అద్వయానంద బ్రహ్మ స్వరూపమేనని నిశ్చయించుకొనుచూ, ధ్యాన నిష్ఠలో నిమగ్నుడై వుండే సాధక మాహానుభావుడు నిత్యమూ మహా సుఖసంపన్నమైన పరిపూర్ణ బ్రహ్మానందానుభూతితో ఓలలాడుతూ ఉండగలడు.

(143)

ఏ భిరంగైః సమాయుక్తో రాజయోగ ఉదాహృతః ।
కించిత్ పక్వ కషాయాణాం హఠయోగేన సంయుతః ॥

15 అంగాలతో కూడిన రాజయోగమనే ఈ సర్వోత్కృష్టమైన జ్ఞానయుక్త సాధనానుష్ఠానం పైన వివరింపబడిన విధంగా చెప్పబడింది. ప్రాపం

చక విషయ వాసనలు ఇంకా మిగిలి వుండడం వల్ల కొద్దిగా పరిపక్వమైన మనస్సుకల సాధకులకు ఈ తత్వవిచార సాధనాక్రమాన్ని హఠయోగాభ్యాసంతో కూడా కలిపి చేసుకోవడం అత్యంత ఫలప్రదమై పరమార్థ ప్రాప్తికి దోహదమౌతుంది.

(144)

పరిపక్వం మనో యేషాం కేవలోఽచ సిద్ధిదః ।
గురుదైవత భక్తానాం సర్వేషాం సులభో జవాత్ ॥

చిత్త శుద్ధితో పూర్ణంగా మనస్సు పరిపక్వం పొందిన సాధకమహాశయులకు, ఈ రాజయోగ సాధనము శీఘ్రంగా ఫలప్రదమై సిద్ధిని కలుగ జేస్తుంది. అన్య మెుల్లని గురుభక్తి, దైవభక్తి కలవారందరికీ కూడా, వారు ఏకుల, మతస్థులైనా స్త్రీ పురుష భేదం లేకుండా, చిత్తసుద్ధి కలిగించి ఈ రాజయోగ సాధన ఫలప్రదము. సులభసాధ్యము అవుతుంది.

—సమాప్తః—